మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 21-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 322 Issue: 322

21 మే 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:46 సూర్యాస్తమయం - సా. 6:39 తిథి పంచమి ఉ. 8:29 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం పుష్యమి రా. 2:49ం వరకు తరువాత ఆశ్లేష యోగం గండ ఉ. 10:58 వరకు కరణం భాలవ ఉ. 8:29 వరకు కౌలవ రా. 7:26 వరకు వర్జ్యం ఉ. 11:44 నుండి మ. 1:14 వరకు దుర్ముహూర్తం ఉ. 10:04 నుండి ఉ. 10:55 వరకు మ. 3:13 నుండి సా. 4:04 వరకు రాహుకాలం మ. 1:49 నుండి మ. 3:26 వరకు యమగండం తె. 5:46 నుండి ఉ. 7:22 వరకు గుళికాకాలం ఉ. 8:59 నుండి ఉ. 10:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:10 నుండి తె. 4:58 వరకు అమృత ఘడియలు రా. 8:47 నుండి రా. 10:17 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:47 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




# మెలోడీతో.. మెలోడీ

## ఇటలీ ప్రధానికి మోదీ చాక్లెట్లు గిఫ్ట్

## సోషల్ మీడియాలో మెలోని పోస్ట్

ఇటలీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ.. ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనికి మెలోడీ చాక్లెట్లు గిఫ్ట్‌గా ఇచ్చారు. ఇద్దరి పేర్లకు సంబంధించి మెలోని పేరులోని మెలో.. మోడీ పేరులోని డీ ఉండేలా మెలోడి చాక్లెట్లను అందించారు. ఈ వీడియోను మెలోని తన సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఒక్కసారిగా వైరల్ అయ్యింది. ఇరు దేశాల ప్రధానుల కలయికను నెటిజన్లు మెలోడీగా పోల్చుతుంటారు. దాన్ని గుర్తుచేస్తూ ప్రధాని మోదీ మెలోడీ చాక్లెట్లను బహుమతిగా ఇవ్వడం గమనార్హం.

రోమ్: ఈ సందర్భంగా ఇరువురు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఇటలీ, ఇండియా మధ్య ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఉందని చెప్పారు. రెండు దేశాల మధ్య సంబంధాలు కీలక దశకు చేరుకునే స్థితికి చేరాయన్నారు. అలాగే, 2025-2029 వరకు ఇండియా-ఇటలీ మధ్య ఉమ్మడి వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను కూడా మోదీ వెల్లడించారు. రెండు - 2 వ పేజీలో...

# బంగారం.. భద్రత



**బంగారం అమ్మితే..**
- దిగుమతులు తగ్గుతాయి, డాలర్ల ఆదా
- మార్కెట్లో నగదు ప్రవాహం పెరుగుతుంది
- పెట్టుబడులు పెరిగే అవకాశం
- బ్యాంకింగ్ వ్యవస్థకు లిక్విడిటీ

**అలాగే ఉంచితే**
- కుటుంబాలకు భద్రత
- సంక్షోభాల్లో సహాయం
- ద్రవ్యోల్బణానికి రక్షణ
- అత్యవసర ఆస్తి

## భారతీయుల వద్ద సుమారు 30 వేల టన్నుల బంగారం

## మార్కెట్ విలువ అంచనా రూ.425 లక్షల కోట్లు

### అనేక దేశాల బ్యాంకు బంగారం నిల్వల కంటే అధికం

### అమ్మితే దేశానికి మేలు అంటున్న మార్కెట్ వర్గాలు

### ఉత్పాదక రంగంలోకి మళ్లించాలని పిలుపులు

### అమ్మితే కుటుంబ భద్రత కష్టమంటున్న ప్రజలు

భారతీయ కుటుంబాల వద్ద ఉన్న బంగారం విలువ లక్షల కోట్ల రూపాయలు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం నిల్వలు కలిగిన ప్రజలుగా భారతీయులు గుర్తింపు పొందారు. కానీ ఇదే బంగారం ఎక్కువ భాగం ఇళ్లలో, లాకర్లలో మూలుగుతోంది. దేశం విదేశాల నుంచి భారీగా బంగారం దిగుమతి చేసుకుంటుండగా, విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కొంతమంది ఆర్థిక నిపుణులు ప్రజలు తమ వద్ద ఉన్న బంగారాన్ని మార్కెట్‌లోకి తీసుకురావాలి, అమ్మాలి లేదా బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావాలి అని సూచిస్తున్నారు. ప్రధాని మోదీ కూడా అవసరం లేని బంగారం కొనుగోళ్లు తగ్గాలి అని వ్యాఖ్యానించారు. మరి ప్రజలు బంగారం అమ్మితే నిజంగా దేశానికి లాభమా? బంగారమే కష్టకాలంలో భారత ఆర్థిక వ్యవస్థకు భద్రతా కవచమా?

(ఈవార్తలు స్పెషల్ డెస్క్)

భారతదేశంలో బంగారం అనేది కేవలం ఒక లోహం కాదు. అది సంపద, భద్రత, గౌరవం, సంప్రదాయం, ఆర్థిక రక్షణ, కుటుంబ వారసత్వానికి ప్రతీక. ఒక ఇంట్లో నగదు లేకపోయినా బంగారం ఉంటే ఆ కుటుంబాన్ని 'పేద'గా భావించరు. గ్రామీణ భారతదేశంలో అయితే బంగారం మహిళల వ్యక్తిగత ఆర్థిక భద్రతగా కూడా పనిచేస్తుంది. వివాహాలు, పండుగలు, శుభకార్యాలు, పెట్టుబడులు.. ప్రతి దాంట్లో బంగారానికి ప్రత్యేక స్థానం ఉంది. అందుకే ప్రపంచ బంగారం వినియోగంలో భారతదేశం ఎప్పుడూ అగ్రస్థానాల్లో ఉంటుంది. భారతీయుల వద్ద 25 వేల టన్నుల బంగారం వివిధ అంచనాల ప్రకారం భారతీయ కుటుంబాలు, దేవాలయాలు, ట్రస్టులు కలిపి సుమారు 25,000 టన్నులకుపైగా బంగారం కలిగి ఉన్నట్లు భావిస్తున్నారు. ఇది అనేక దేశాల కేంద్ర బ్యాంకుల తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,704 |
| వెండి (కిలో): | రూ.3,00,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,075 |



# 46.5 డిగ్రీలు

### నిర్మల్ జిల్లాలో రికార్డు ఉష్ణోగ్రత.. అగ్నిగోళంలా తెలంగాణ

నిర్మల్, మే 20 (ఈవార్తలు): తెలంగాణ వ్యాప్తంగా ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. రోహిణి కార్తె ప్రవేశానికి ముందే సూర్య భగవానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల మార్కును దాటడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలు నిప్పుల గుండాల్లా మారాయి. అత్యధికంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో 46.5 డిగ్రీల గరిష్ట తరువాయి 2 వ పేజీలో...

# మధ్యాహ్నం ప్రయాణాలొద్దు



### ప్రజలకు సీఎం రేవంత్ సూచనలు

### ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి

### అధికారులకు కీలక ఆదేశాలు

తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు.

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, తరువాయి 2 వ పేజీలో...

# రూపాయికి ఆర్బీఐ సాయం




### విలువ పడిపోకుండా చర్యలు


### 5 బిలియన్ డాలర్ల బై, సెల్ చేపట్టాలని నిర్ణయం

### మే 26వ తేదీ నుంచి వేలం ప్రక్రియ

భారత కరెన్సీ రూపాయి రోజురోజుకూ క్షీణిస్తోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 96ను దాటి పడిపోయింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రంగంలోకి దిగింది. ఆర్బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకింగ్ వ్యవస్థలోకి నగదు లభ్యతను పెంచడానికి 5 బిలియన్ డాలర్ల విలువైన డాలరు - రూపాయి బై, సెల్ స్వాప్ వేలాన్ని చేపట్టనుంది.

న్యూఢిల్లీ: మే 26వ తేదీన వేలం ప్రక్రియ చేపట్టనున్నట్లు వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో రూపాయి విలువ పతనమవుతోంది. దీంతో బై, సెల్ స్వాప్ వేలం నిర్ణయం తీసుకుంది. పరిస్థితులకు అనుగుణంగా మూడేళ్ల కాలపరిమితితో రూపాయి - డాలర్ బై, సెల్ స్వాప్ వేలాన్ని నిర్వహించాలని తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



సముద్ర జీవుల్లో వెరైటీ..రెడ్ లిప్డ్ బ్యాట్‌ఫిష్. ఈ చేపకు ఎర్రని పెదాలుంటాయి. తనకు ఉన్న రెక్కల వంటి ఫిన్స్ సహాయంతో సముద్ర అడుగుభాగంపై నడుస్తూ సంచరిస్తుంది.





# గంగమ్మ మింగేసింది!

### కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు దుర్మరణం.. జగిత్యాల జిల్లా కొండాపూర్‌లో ఘోర విషాదం

మేడిపెల్లి/జగిత్యాల బ్యూరో, మే 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలోని కోనేరులో పడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలో నివాసమంటున్న భారతి, భూషణం దంపతుల పిల్లలు మనవిత్ (10) , మనస్విని (9). ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో కొండాపూర్‌లోని తమ చిన్నమ్మ ఇంటికి వెళ్లారు. చిన్నమ్మ కొడుకు షర్వింద్ (7)తో కలిసి ఆడుకుంటూ, స్నానం కోసం శివగంగ ఆలయం వద్ద ఉన్న కోనేరు వద్దకు తరువాయి 2 వ పేజీలో...

# టెట్రా ప్యాక్‌లో వోడ్కా!

### ఇది మోసపూరిత చర్యే.. కేంద్రానికి సుప్రీం తాఖీదులు

చిన్న పిల్లలు తాగే ఫ్రూట్ జ్యూస్‌లు, మిల్క్ షేక్‌ల తరహాలో టెట్రా ప్యాక్‌లు, సాచెట్లలో వోడ్కా లిక్కర్‌ను విక్రయించడంపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర ఆక్షేపణ తెలిపింది. ఇది వినియోగదారులను, అభం శుభం తెలియని చిన్నారులను తప్పుదారి పట్టించడమే అవుతుందని పేర్కొంది. ఇది 'మోసపూరితం' అని పేర్కొంటూ దీనిపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి, పలు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖలకు నోటీసులు జారీ చేసింది.

న్యూఢిల్లీ: కమ్యూనిటీ ఎగైనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్ అనే స్వచ్ఛంద సంస్థ వేసిన పిటిషన్‌పై సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఈ నోటీసులు ఇచ్చింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది విపిన్ నాయిర్ తన వాదన వినిపిస్తూ, ఇలాంటి చాలా ఆల్కహాల్ ఉత్పత్తులపై హెచ్చరికలు తరువాయి 2 వ పేజీలో...



# కులాల లెక్కలు అవసరమే

### సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కులగణన సహితంగా జనాభా లెక్కలు చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రభుత్వాలకు సంక్షేమ విధానాలను రూపొందించేందుకు కులాల వారీగా లెక్కలు అవసరమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కులాలకు సంబంధించిన వివరాలు, గణాంకాలు, ప్రభుత్వాల -2 వ పేజీలో...

## రాశి ఫలాలు

21.5.2026

మేషం: వృథా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. నేత్ర ఉదర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. మిత్రులతో ఊహించని కలహాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు నిదానంగా సాగుతాయి.

వృషభం: కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. సంఘంలో ప్రముఖుల ఆదరణ పెరుగుతుంది. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వాహన యోగం ఉన్నది. ఉద్యోగాలలో పురోగతి సాధిస్తారు.

మిధునం: నూతన ఋణాలు చేస్తారు. బంధుమిత్రులతో కొన్ని వ్యవహారాలలో విభేదాలు కలుగుతాయి. ఆరోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. కొన్ని పనులు మధ్యలో వాయిదాపడతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది.

కర్కాటకం: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థికంగా కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. చేపట్టిన పనులలో అనుకూల వాతావరణం ఉంటుంది. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు కలుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

సింహం: నూతన పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది.

కన్య: ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. మిత్రులతో కొన్ని వ్యవహారాలలో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. గృహ విషయమై ఆలోచనలు స్థిరంగా ఉండవు. స్వల్ప అనారోగ్య సూచనలు ఉన్నవి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

తుల: వృథా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. బంధుమిత్రులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. కుటుంబ సమస్యలు చికాకు పరుస్తాయి. అనారోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. వ్యాపారాలు కొంత నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమౌతుంది.

వృశ్చికం: ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు. ఆప్తులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది.

ధనస్సు: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగమున అధికారులతో చర్చలు సఫలం అవుతాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఇంటాబయట బాధ్యతలు పెరుగుతాయి. కుటుంబ పెద్దల ఆరోగ్యం విషయంలో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. వ్యాపారాలు కొంత మందగిస్తాయి. ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

కుంభం: ముఖ్యమైన వ్యవహారాలు శ్రమతో కానీ పూర్తి కావు. కొన్నిపనులు వాయిదా వేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేయవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

మీనం: విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. దాయాదులతో భూవివాదాలు పరిష్కారమౌతాయి. సంఘంలో ఆదరణ పెరుగుతుంది. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అంచనాలు అందుకుంటారు.

# బంగారం.. భద్రత

మొదటి పేజీ తరువాయి



బంగారం నిల్వల కంటే ఎక్కువ. ఈ బంగారం విలువ కోట్ల కోట్ల రూపాయలకు చేరుకుంటుంది. కానీ ఇందులో చాలా భాగం బ్యాంకింగ్ వ్యవస్థలో లేదు. అది ఆభరణాల రూపంలో ఇళ్లలోనే నిల్వగా ఉంది.

### దేశం కోసం బంగారం అమ్మాలా?

భారతదేశం ప్రతి సంవత్సరం భారీగా బంగారం దిగుమతి చేసుకుంటుంది. దీనికి డాలర్లలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. దీంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతుంది. చమురు తర్వాత భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకునే వస్తువుల్లో బంగారం ఒకటి. బంగారం దిగుమతులు పెరిగితే కరెంట్ అకౌంట్ లోటు కూడా పెరుగుతుంది. ప్రజలు ఇప్పటికే ఉన్న బంగారాన్ని అమ్మినా లేదా రీసైకిల్ చేయించినా కొత్త దిగుమతుల అవసరం తగ్గుతుంది. దీని వల్ల దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసే అవకాశం ఉంటుంది.

### యాక్టివ్ క్యాపిటల్‌గా డెడ్ అసెట్

ఇళ్లలో లాకర్లలో ఉండే బంగారం ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్షంగా ఉపయోగపడదు. కానీ అదే బంగారం అమ్మి వ్యాపారాల్లో పెట్టుబడిగా మారితే ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయి. బంగారం నుంచి వచ్చిన డబ్బు ఉత్పాదక రంగాల్లోకి వెళితే దేశ జీడీపీ పెరిగే అవకాశముంటుంది.

### బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీ పెరుగుతుంది

ప్రజలు బంగారం బ్యాంకులకు ఇచ్చి గోల్డ్ డిపాజిట్ స్కీమ్స్‌లో పెట్టితే బ్యాంకులు ఆ బంగారాన్ని ఆర్థిక కార్యకలాపాలకు వినియోగించగలవు. గోల్డ్ డిపాజిట్ స్కీమ్స్‌తో బ్యాంకులకు అదనపు వనరులు అందుతాయి, అప్పుల పంపిణీ పెరుగుగుతంది. వడ్డీ ఒత్తిడి తగ్గుతుంది. మార్కెట్లో నగదు ప్రవాహం పెరుగుతుంది అని నిపుణులు చెబుతున్నారు.

### మోదీ ఎందుకు బంగారం కొనొద్దు అంటున్నారు?

ప్రధాని నరేంద్ర మోదీ అనేక సందర్భాల్లో "అవసరానికి మించి బంగారం కొనడం ఆర్థికంగా మంచిది కాదు" అని సూచించారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. భారతదేశం బంగారం ఎక్కువగా విదేశాల నుంచి కొనుగోలు చేస్తుంది. ప్రజలు ఎక్కువగా బంగారం కొంటే దిగుమతులు పెరుగుతాయి. దీని వల్ల రూపాయి విలువపై ఒత్తిడి వస్తుంది. బంగారంలో కాకుండా షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బాండ్లు, తయారీ రంగం, స్టార్టప్‌ల వంటి రంగాల్లో పెట్టుబడి పెట్టాలని కోరుతోంది. అలా చేస్తే ఉద్యోగాలు, పరిశ్రమలు, ఉత్పత్తి పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

### సంక్షోభ సమయంలో బంగారమే రక్షణ

1991 ఆర్థిక సంక్షోభంలో దేశాన్న కాపాడింది బంగారమే. భారత ఆర్థిక చరిత్రలో 1991 అత్యంత కీలకమైన సంవత్సరం. దేశ విదేశీ మారక నిల్వలు కేవలం కొన్ని రోజుల దిగుమతులకు సరిపడే స్థాయికి పడిపోయాయి. అప్పట్లో భారత్ తన బంగారం నిల్వలను విదేశీ బ్యాంకులకు తాకట్టు పెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చుకుంది. ఈ సంఘటన తర్వాత బంగారం దేశానికి చివరి భద్రత అనే భావన మరింత బలపడింది. కోవిడ్ సమయంలో ఉద్యోగాలు పోయాయి, ఆదాయాలు తగ్గాయి, వ్యాపారాలు మూతపడ్డాయి. అలాంటి సమయంలో గ్రామీణ, మధ్యతరగతి కుటుంబాలు బంగారం మీద అప్పులు తీసుకుని జీవించాయి. అనేక కుటుంబాలకు బంగారం ఆర్థిక ఆక్సిజన్‌లా పనిచేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలామందికి బ్యాంకింగ్ వ్యవస్థ కంటే బంగారం మీదే ఎక్కువ నమ్మకం ఉంటుంది.

### భారతీయుల్లో భయాలు:

1. కుటుంబ భద్రత తగ్గే అవకాశం
   భారతీయ కుటుంబాల్లో ముఖ్యంగా మహిళల ఆర్థిక భద్రతగా బంగారం ఉంటుంది. ఆభరణాలు అనేవి చాలాసార్లు అత్యవసర నిధుల్లా పనిచేస్తాయి. అవి పూర్తిగా అమ్మేస్తే భవిష్యత్తులో సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది.
2. సంక్షోభాల్లో రక్షణ తగ్గిపోవచ్చు
   స్టాక్ మార్కెట్లు పడిపోవచ్చు. కరెన్సీలు బలహీనపడవచ్చు. బ్యాంకులు సంక్షోభంలో పడవచ్చు.
   కానీ బంగారం సాధారణంగా దీర్ఘకాలంలో విలువను నిలబెట్టుకుంటుంది. అందుకే ప్రపంచ కేంద్ర బ్యాంకులే ఇంకా భారీగా బంగారం కొనుగోలు చేస్తున్నాయి.
3. సాంస్కృతిక ప్రభావం
   భారతదేశంలో బంగారం కేవలం పెట్టుబడి కాదు. అది కుటుంబ గౌరవం, సంప్రదాయం, వివాహ వ్యవస్థలో భాగం. కాబట్టి "బంగారం అమ్మేయండి" అనే పిలుపు సామాజికంగా అంత సులభంగా ఆమోదం పొందదు. ప్రపంచ దేశాలు కూడా బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయి. అమెరికా, చైనా, రష్యా, టర్కీ వంటి దేశాలు తమ బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయి. కారణం – గ్లోబల్ ఆర్థిక అనిశ్చితి. డాలర్ ఆధిపత్యం, యుద్ధాలు, ఆంక్షలు, ద్రవ్యోల్బణం వంటి పరిస్థితుల్లో బంగారం "సేఫ్ హేవెన్ అసెట్"గా భావిస్తున్నారు. ఇదే సమయంలో భారతీయులకు మాత్రం "బంగారం కొనొద్దు" అనే సందేశం రావడం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.

# గంగమ్మ మింగేసింది!

మొదటి పేజీ తరువాయి

వెళ్లారు. నీటి లోతును అంచనా వేయలేక ముగ్గురు చిన్నారులూ కోనేరులో మునిగిపోయారు. స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే వారు ప్రాణాలు కోల్పోయారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చిన్నారులు కళ్ల ముందు నిర్జీవంగా మారడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సెలవుల్లో సరదాగా గడుపుదామని వచ్చిన పిల్లలు ఇలా అనంత లోకాలను వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# మెలోడీతో.. మెలోడీ

మొదటి పేజీ తరువాయి



దేశాల మధ్య సంబంధాల పెంపునకు, భవిష్యత్ నిర్మాణానికి ఇది దోహదం చేస్తుందన్నారు. రెండు దేశాల మధ్య 20 బిలియన్ యూరోలు టార్గెట్‌గా వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఇటలీకి చెందిన 400 సంస్థలు దేశంలో ఇప్పటికే సేవలందిస్తున్నాయని మోదీ తెలిపారు. అనంతరం ఇటలీ ప్రధాని జార్జియా మెలోని మాట్లాడుతూ.. ఇప్పుడు రెండు దేశాల మధ్య సంబంధాలు గతంలో ఎన్నడూ లేని ఉన్నత స్థాయికి చేరాయని చెప్పారు. పూర్తిస్థాయిలో సంబంధాల్ని బలోపేతం చేసుకుంటామన్నారు. మోదీతో తాను ఏడుసార్లు సమావేశమైనట్లు మెలోని చెప్పారు. తనకు మోదీకి మధ్య పరస్పర స్నేహం, గౌరవం, విశ్వాసం ఉన్నాయన్నారు.



# టెట్రా ప్యాక్‌లో వోడ్కా!

మొదటి పేజీ తరువాయి

ఉండటం లేదన్నారు. పొగాకు తరహాలో వార్నింగ్ హెచ్చరికలు లేకపోవడం వల్ల ఇవి పండ్ల రసాల్లా కనిపిస్తాయని, కానీ అందులో ఉండేది మాత్రం వోడ్కా అని చెప్పారు. టెట్రా ప్యాకింగ్ సాధారణంగా చిన్నపిల్లలు తాగే పండ్లరసాలు, పాల ఉత్పత్తులకు వాడతారని, ఫ్రూట్ జ్యూస్‌లను పోలినట్టు ఉండటంతో చిన్నారులు జ్యూస్ అనుకుని తాగే ప్రమాదం ఉందని అన్నారు. ఇలాంటి ప్యాకేజ్‌ల్లో మద్యం అమ్మకాలపై నిషేధం విధిస్తూ యూనిఫాం పాలసీ రూపొందించేలా కేంద్రానికి, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలివ్వాలని అత్యున్నత న్యాయ స్థానాన్ని విపిన్ నాయర్ కోరారు. మద్యం వ్యాపారులు ఖర్చు తగ్గించుకోవడానికి, రవాణా సులువుగా ఉండేందుకు గ్లాస్ బాటిళ్లకు బదులుగా టెట్రా ప్యాక్‌లు వాడుతున్నారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలాంటి ప్యాక్‌లతో వోడ్కా అమ్మకాలు జరపడం మద్యం వినియోగాన్ని, డ్రంక్ అండ్ డ్రైవ్‌ను ప్రోత్సహించడమే అవుతుందని, రాష్ట్రాల సరిహద్దుల వెంబడి స్మగ్లింగ్‌కు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్పత్తులను మార్కెట్ చేయడం, డిజైన్ చేసే విధానం వినియోగ దారులను తప్పుదారి పట్టించేలా ఉందని వాదించారు. ఇరువైపు వాదనల విన్న కోర్టు ఇలాటి మోసపూరిత విక్రయాలు ప్రజారోగ్యానికి ముప్పని భావిస్తూ కేంద్రం, రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చిం ది. టెట్రా ప్యాకెట్లలో మద్యం అమ్మకాలు పెరుగుతుండటంపై 2025 నవంబర్‌లో సుప్రీంకోర్టు విమర్శలు చేసింది. వీటి ప్యాకేజీ ఫ్రూట్ జ్యూస్ కార్టన్లను పోలి ఉందని పేర్కొంది.

# 46.5 డిగ్రీలు

మొదటి పేజీ తరువాయి

ఉష్ణోగ్రత నమోదై, ఈ సీజన్‌లోనే అత్యంత వేడి రోజుగా నిలిచింది. రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. హన్మకొండ, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. జగిత్యాల, జనగాం, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల్లో పాదరసం 46.3 డిగ్రీలకు చేరింది. అదేవిధంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో 46.2 డిగ్రీలు, ములుగు, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 46.1 డిగ్రీలు, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో 46.0 డిగ్రీల చొప్పున గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండటంతో, మధ్యాహ్నానికి ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. వేడి గాలుల కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఈ తీవ్రమైన పరిస్థితుల దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.







# రూపాయికి ఆర్బీఐ సాయం

మొదటి పేజీ తరువాయి

నిర్ణయించినట్లు ఆర్బీఐ తెలిపింది. మార్కెట్‌లో నగదు లభ్యతను పెంచడానికి ఆర్బీఐ బై, సెల్ స్వాప్ విధానాన్ని అనుసరిస్తుంటుంది. వాణిజ్య బ్యాంకులు తమ వద్ద ఉన్న డాలర్లను ఆర్బీఐకి విక్రయించి, దానికి సమానమైన రూపాయలను పొందడమే ఈ విధానం. మూడేళ్ల గడువు ముగిసిన తర్వాత అంతే మొత్తంలో డాలర్లను ముందే నిర్ణయించిన ప్రీమియం ధరతో తిరిగి కొనుగోలు చేయడానికి బ్యాంకులు ఒప్పందం చేసుకుంటాయి. ఈ విధానం ద్వారా బ్యాంకులకు నిధుల లభ్యత పెరుగుతుంది. మరోవైపు ఆర్బీఐ వద్ద విదేశీ మారకం నిల్వలు పెరుగుతాయి. ఫలితంగా రూపాయి పతనం ఆగిపోతుంది.

## కులాల లెక్కలు అవసరమే

మొదటి పేజీ తరువాయి

వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్నాయంటూ పిటిషనర్ సుధాకర్ గుమ్ముల చేసిన వాదనలతో ప్రధా న న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం ఏకీభవించక వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

## మధ్యాహ్నం ప్రయాణాలొద్దు

మొదటి పేజీ తరువాయి

విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశిస్తూనే, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బండి భగీరథ్ కేసులో మరో సెక్షన్

**సాక్ష్యాలను ధ్వంసం చేసిన సెక్షన్ జత**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ కీలక సాక్ష్యాలను మాయం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 8న పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వెంటనే ఫోన్ స్విచ్చాఫ్ చేసిన నిందితుడు, పరారీలో ఉన్న సమయంలో పథకం ప్రకారం తన అత్యాధునిక ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను డిలీట్ చేయడమే కాకుండా, సోషల్ మీడియా అకౌంట్లను కూడా మాయం చేశాడు. అరెస్ట్ అనంతరం పోలీసులు ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా, అందులో సిమ్ కార్డ్ లేకపోవడం, ఫోన్ ఖాళీగా ఉండటంతో.. సాక్ష్యాలను ధ్వంసం చేసిన నేరం కింద పోలీసులు ఈ కేసులో అదనంగా బీఎన్ఎస్ సెక్షన్ 238ను (గతంలో ఐపీసీ 201) జోడించారు. చట్టం నుంచి తప్పించుకోవడానికి ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్లు అనుమానిస్తున్న పోలీసులు, నిందితుడి కంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో ఉచ్చు బిగించేందుకు సిద్ధమయ్యారు. ఐఫోన్ సెక్యూరిటీ ఫీచర్లు కఠినంగా ఉన్నప్పటికీ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిపుణుల వద్ద ఉన్న 'సెలెబ్రైట్' వంటి అంతర్జాతీయ స్థాయి అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ల ద్వారా డిలీట్ అయిన చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ ఐఫోన్ అంతర్గత మెమొరీని పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా, ఐక్లౌడ్ బ్యాకప్ సర్వర్ల నుండి డేటాను సేకరించేందుకు, అవసరమైతే కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకు సైతం సిద్ధమవుతున్నారు. వీటితో పాటు, నిందితుడు ఫోన్ స్విచ్చాఫ్ కావడానికి ముందు ఎక్కడ ఉన్నాడు, ఎవరితో మాట్లాడాడు, ఆశ్రయం కల్పించిన తెరవెనుక సూత్రధారులు ఎవరు అనే వివరాల కోసం సెల్ టవర్ మ్యాపింగ్, కాల్ డేటా రికార్డులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ సాంకేతిక ప్రక్రియల్లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే, కేసును పటిష్టంగా కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు 'ప్లాన్ బి'ని కూడా సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా బాధితురాలి ఫోన్‌ను మరో కీలక సాక్ష్యంగా మార్చనున్నారు. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపు సందేశాలు, ఫొటోలు, వీడియోలను 'రిసీవ్డ్ డేటా' రూపంలో సేకరించి, వాటిని ధ్రువీకరించి కోర్టు ముందు ఉంచనున్నారు.



పోక్సో కేసులో సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించడం నేర తీవ్రతను మరింత పెంచుతుందని చట్టపరమైన నిపుణులు స్పష్టం చేస్తున్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## కుర్చీ తాత హఠాన్మరణం

**గుండె పోటుతో మృతి**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): తెలుగు ప్రజలకు సుపరిచితుడైన 'కుర్చీ తాత' అలియాస్ మహ్మద్ పాషా (66) బుధవారం హఠాన్మరణం చెందారు. హైదరాబాద్‌లోని కృష్ణకాంత్ పార్కులో ఉదయం వాకింగ్ చేస్తుండగా ఆయనకు ఒక్కసారిగా తీవ్రమైన గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచారు. యూట్యూబ్ ఇంటర్వ్యూలలో మహ్మద్ పాషా సరదాగా చెప్పిన 'కుర్చీ మడతపెట్టి..' అనే మాస్ డైలాగ్ సోషల్ మీడియాను ఊపేసింది. రికార్డు స్థాయిలో మీమ్స్, రీల్స్‌తో ఈ డైలాగ్ వైరల్ అయ్యింది. దీని క్రేజ్‌ను గమనించిన ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'గుంటూరు కారం' సినిమాలో ఈ డైలాగ్‌ను ఒక పాటగా మార్చారు. స్వయంగా మహ్మద్ పాషా ఆ పాటలో మహేష్ బాబు, శ్రీలీలలతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుని డాన్స్ కూడా చేశారు. ఆ సినిమా తర్వాత ఆయనకు ఇండస్ట్రీలో మరికొన్ని అవకాశాలు, ఇంటర్వ్యూలు రావడంతో బిజీగా మారారు. అంతవరకు సాదాసీదా జీవితం గడిపిన ఆయన, కుర్చీ తాతగా మారి అందరినీ నవ్వించారు. అలాంటి వ్యక్తి వాకింగ్ చేస్తూ ఇలా హఠాత్తుగా కన్నుమూయడంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



## ఇష్టమొచ్చినట్లు ఫ్లెక్సీలు ఉండొద్దు

**అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): శాంతి భద్రతల విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని పోలీసు ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసు శాఖ ఆధునికంగా మారాలని సూచించారు. పోలీసు శాఖలో అవినీతికి తావులేదని, మెరిట్ ఆధారంగానే పోస్టింగులు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అన్ని పోలీసు స్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవాలని చెప్పారు. డ్రగ్స్, గంజాయి, ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించిన సీఎం, సైబర్ క్రైమ్ నియంత్రణకు ప్రత్యేక శిక్షణ, డేటా సెంటర్లు, ఫోరెన్సిక్ వ్యవస్థలను బలోపేతం చేయాలని అన్నారు. నైట్ పెట్రోలింగ్, డ్రోన్ పోలీసింగ్, సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచాలని సూచించిన ఆయన, రౌడీ షీట్లపై నిరంతర సమీక్ష ఉండాలని తెలిపారు. నగరంలో అడ్డగోలుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్లు, జీహెచ్ఎంసీ అధికారులను సీఎం ఆదేశించారు.

## వరంగల్ జంట హత్యల కేసు.. నిందితుడికి మరణశిక్ష

వరంగల్, మే 20 (ఈవార్తలు): వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక పాశవిక జంట హత్యల కేసులో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జె. మైత్రేయి నిందితుడికి మరణశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. 2024 జులై 10 అర్ధరాత్రి వేళ, చెన్నారావుపేట మండలం చింతల తండాలో జంట హత్యల ఘటన చోటుచేసుకుంది. గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు (బన్నీ), తండాకు చెందిన దీపికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే నాగరాజు ప్రవర్తన నచ్చక దీపిక పుట్టింటికి వచ్చేయడంతో, తన భార్యను దూరం చేశారనే పగతో నాగరాజు కక్ష పెంచుకున్నాడు. అర్ధరాత్రి వేళ కత్తితో దీపిక కుటుంబంపై విచక్షణా రహితంగా దాడి చేయగా.. ఆమె తల్లి సుగుణ అక్కడికక్కడే, తండ్రి శ్రీను ఆసుపత్రి మార్గమధ్యంలో మృతి చెందారు. తీవ్ర గాయాలైన దీపిక, ఆమె సోదరుడు మదన్ ప్రాణాలతో బయటపడ్డారు. నెక్కొండ సీఐ శ్రీనివాస్ పక్కా సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేయగా, బాధితుల తరపున స్పెషల్ పీపీ బృందాదేవి వాదించారు. నిందితుడి చర్య అత్యంత పాశవికమైనదని, సమాజంలో ఇలాంటి నేరగాళ్లకు జీవించే హక్కు లేదని స్పష్టం చేస్తూ.. నిందితుడు నాగరాజుకు మరణించే వరకు ఉరిశిక్ష అమలు చేయాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

## సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు

**66 మందిని అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): ఆపరేషన్ ఆక్టోబస్ 3.0లో భాగంగా సైబర్ నేరగాళ్లకు సిమ్ కార్డులు అందిస్తున్న 66 మందిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 13 రాష్ట్రాల్లో దాడులు నిర్వహించారు. ఘోస్ట్ సిమ్ కార్డులతో దేశవ్యాప్తంగా ఎన్నో సైబర్ నేరాలు చేసినట్లు గుర్తించారు. పద్దెనిమిది బృందాలతో ఏడురోజుల పాటు ఈ ఆపరేషన్‌ను కొనసాగించగా, 1,194 ఘోస్ట్ సిమ్ కార్డులను గుర్తించి, వాటిలో 544 కార్డులను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, హర్యానా, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. సైబర్ నేరగాళ్ళకు 20 మంది పీవోఎస్ ఏజెంట్లు సహకారం అందించినట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 10 మంది వోడాఫోన్ ఐడియా, ఏడుగురు సిమ్ కోసం వచ్చిన వారికి తెలియకుండా మరో సిమ్ యాక్టివేట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# జూన్ 2న మరో స్టీల్ బ్రిడ్జి ఓపెన్

**తుది దశకు నల్లగొండ ఎక్స్ రోడ్ ఓవైసీ హాస్పిటల్ వే**



హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్కైవేలు.. అంతే వేగంగా నిర్మాణం అవుతున్నాయి. విశ్వనగరంగా ఎదిగిన హైదరాబాద్‌లో ఉన్న కోట్ల మంది ప్రజల రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేసేందుకు ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు.. మౌలిక వసతులు కల్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే గత కొంత కాలంగా ఎన్నో ఫ్లైఓవర్లు నగరంలో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే ఎన్నో ఏళ్ల క్రితం ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జి.. ఎట్టకేలకు నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటోంది. త్వరలోనే ఆ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చి.. నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలను తగ్గించాలని అధికారులు భావిస్తున్నారు. నిత్యం వాహనాల రద్దీతో.. తీవ్ర ట్రాఫిక్ జాం అయ్యే మలక్‌పేట వద్ద నల్గొండ క్రాస్ రోడ్డు నుంచి కంచన్ బాగ్ వద్ద ఉన్న ఓవైసీ హాస్పిటల్ వరకు నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ స్టీల్ బ్రిడ్జిని త్వరలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు రెడీ అవుతున్నాయి. మొత్తం 3.32 కిలోమీటర్ల పొడవు, ఆరు లేన్లుగా నిర్మించిన ఈ స్టీల్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి సుమారు రూ.630 కోట్ల వ్యయం అయినట్లు తెలుస్తోంది. అయితే ఈ స్టీల్ బ్రిడ్జి.. క్షేత్ర స్థాయిలో ఎన్నో అడ్డంకులను దాటుకుని.. ఎట్టకేలకు నిర్మాణం పూర్తి చేసుకోగా.. త్వరలోనే ప్రారంభానికి సిద్ధం అవుతోంది. అయితే మరీముఖ్యంగా ఐఎస్ సదన్ వద్ద ఉన్న ఒక దేవాలయం.. మరో ప్రార్థన మందిరాలపై ప్రభావం పడేలా ఈ స్టీల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారని.. స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతోపాటు చాలాసార్లు ఆందోళనలు కూడా చేశారు. వీటికి తోడు భూ సేకరణ కూడా ఎన్నో అవాంతరాల మధ్య పూర్తి అయింది. ఎన్ని అడ్డంకులు వచ్చినా.. అధికారులు వ్యూహాత్మకంగా వాటిని అధిగమిస్తూ వచ్చి.. ఈ స్టీల్ వంతెన పనులను తుది దశకు తీసుకువచ్చారు. ఇటీవలె కొన్ని రోజుల క్రితం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ ఆర్‌వీ కర్ణన్.. ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ముందుగా నిర్ణయించుకున్న గడువులోగా ఈ స్టీల్ వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగి.. పనుల్లో వేగం పెంచారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 2వ తేదీన ఈ స్టీల్ వంతెనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి.. నగరవాసులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# అప్పుడు బండి సంజయ్ గల్లీ లీడర్

**బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ వ్యాఖ్య**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): బండి భగీరథ్ పోక్సో కేసు.. దేశం మొత్తం తీవ్ర సంచలనం రేపుతున్న వేళ.. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక విషయాలు వెల్లడించారు. తాను బండి సంజయ్ వ్యక్తిగత విషయాల గురించి, బండి భగీరథ్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడటం లేదని స్పష్టం చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. తాను ఈ పోక్సో కేసు గురించి మాత్రమే మాట్లాడుతున్నానని.. ఎఫ్ఐఆర్‌లో పోలీసులు ఏమేం చెప్పారు, బాధితురాలి తల్లి చేసిన ఆరోపణలపైన మాత్రమే మాట్లాడుతున్నానని వెల్లడించారు. ఇక తాను 2001 నుంచి 2004 వరకు కరీంనగర్ ఎస్పీగా పనిచేశానని చెప్పిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. ఆ సమయంలో బండి సంజయ్ అంటే ఒక బస్తీ నాయకుడు, గల్లీ లీడర్ అంటూ వ్యాఖ్యానించారు. ఇక బండి సంజయ్‌కి, తనకు ఎలాంటి వివాదం లేదని తేల్చి చెప్పారు. తనకు ప్రత్యక్షంగా బండి సంజయ్‌తో ఎలాంటి పరిచయం లేదని తేల్చి చెప్పారు. గతంలో తాను గురుకుల కార్యదర్శిగా, స్వేరోస్‌లో ఉన్నప్పుడు.. తనపై బండి సంజయ్ విమర్శలు చేశారని చెప్పిన ఆయన.. వాటిని తాను అప్పుడే మర్చిపోయినట్లు తెలిపారు. అవి ఆయన చేసిన వ్యాఖ్యలు కాదని.. కిషన్ రెడ్డి లేక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నాగ్‌పూర్ హెడ్ క్వార్టర్స్ నుంచి వచ్చిన స్క్రిప్ట్ అంటూ కొట్టిపారేశారు. తనకు బండి సంజయ్ ఏమీ శత్రువు కాదని, తాము ఎప్పుడూ కలుసుకోలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తేల్చి చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జనాలను చదివిస్తున్నారు, ఇంగ్లీష్ నేర్పిస్తున్నారు, వారిని విదేశాలకు పంపిస్తున్నారు.. దీంతో జనాలు అంతా డెవలప్ అయితే.. ప్రతీ ఇంటికి ఒక పూలే, అంబేద్కర్, కాన్షీరాం, ఐన్‌స్టీన్ వంటి గొప్పవాళ్లు తయారు అవుతారనే భయంతో, కుట్రతో తనపై దీర్ఘకాలిక కుట్ర చేశారని ఆరోపించారు. తాను బండి సంజయ్‌పై ఎప్పుడూ పర్సనల్‌గా వ్యాఖ్యలు చేయలేదని మరోసారి స్పష్టం చేశారు. తాను ఎవరి పర్సనల్ విషయాల్లోకి వెళ్లనని తేల్చి చెబుతూనే.. వాళ్లు ఏం బ్రాండ్ విస్కీ తాగుతారు, వారు ఏం బ్రాండ్ బీర్ తాగుతారు.. ఎక్కడ గంజాయి తెచ్చుకుంటారు.. ఏం బ్రాండ్ గుట్కా, తంబాకు తింటారు అనేదానిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదని స్పష్టం చేశారు. ఇక బండి భగీరథ్ పోక్సో కేసు వెలుగులోకి వచ్చినప్పటి నుంచి.. మీడియాతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.. ఈ కేసులో బాధిత బాలిక తల్లితో తాను మాట్లాడినట్లు ఇప్పటికే వెల్లడించారు.

## నేనేంటో మా కార్యకర్తలకు తెలుసు

**కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): తాను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసని, పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కన్న కొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే తాను కుమారుడిని అప్పగించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను 'మీ చివరి కోరిక ఏమిటి' అని అడిగితే చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటామని అన్నారు. తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందిస్తూ, కేసీఆర్ పార్టీకి లోక్ సభలో ఒక్క ఎంపీ కూడా లేరని అన్నారు. వారు ఫామ్ హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారని అన్నారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది, ఆ కుటుంబ పాలనను అంతం చేసింది తామేనని అన్నారు. అందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

## కలిసి తిరిగారు.. ఎక్కడ బెడిసికొట్టిందో!

**బండి భగీరథ్ కేసుపై బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టు కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఈ కేసుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసు పూర్తిగా రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవ అని ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాకేశ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తమకు వచ్చిన కొన్ని వీడియోల ప్రకారం ఆ రెండు కుటుంబాల మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో అర్థమవుతుందని చెప్పారు.

## జూన్ 2 తర్వాత మద్యం ధరల పెంపు

**15 శాతం వరకు పెంచాలని కమిటీ సిఫార్సులు**

**మందుబాబులకు బిగ్ షాక్**



హైదరాబాద్, మే 20 (ఈవార్తలు): తెలంగాణలో మద్యం ప్రియులకు షాక్ ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెడీ అయినట్లు తెలుస్తోంది. త్వరలోనే రాష్ట్రంలో మందు, బీర్ల ధరలు పెరగనున్నాయని సమాచారం. రాష్ట్రంలో మద్యం ధరల పెరుగుదలకు సంబంధించి.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఇప్పటికే సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీ తర్వాత.. అన్ని రకాల మద్యం ధరలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. మద్యం ధరలను పెంచాలని ఇప్పటికే తయారీ కంపెనీల నుంచి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. అదే సమయంలో గతంలో పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన సమయంలోనే మద్యం ధరలను పెంచాలని మద్యం తయారీ కంపెనీలు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. అయితే యుద్ధం ఎఫెక్ట్ సీసాల తయారీపైనా పడటంతో.. వాటి ధరలు పెరిగాయి. ఇక మద్యం ధరలో సీసాల తయారీ ఖర్చు ఎక్కువగా ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే కమర్షియల్ గ్యాస్ ధరలు దాదాపు రెట్టింపు కావడంతో సీసాల తయారీ ఖర్చు 15 శాతం నుంచి 20 శాతం వరకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో వాటికి అనుగుణంగా ధరలను పెంచాలని కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఇక అన్ని మద్యం బ్రాండ్లపై కనీసం 10 శాతం నుంచి 15 శాతం వరకు ధరలు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపడుతోంది. దీంతో సాధారణ, మీడియం బ్రాండ్లతో పాటు ప్రీమియం బ్రాండ్ల మద్యం ధరలు కూడా భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక పెంచిన మద్యం ధరల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అదనంగా ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు ఆర్థిక, అబ్కారీ శాఖలు చర్యలు తీసుకుంటున్నాయి.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE: Price for 5 Lines – Rs.450 (for each extra line – Rs.90)

COLOUR: Price for 5 Lines – Rs.500 (for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com

# గెట్ అవుట్ అంటున్న అమెరికా

## ఉద్యోగం పోయాక ఉండేందుకు 60 రోజులే గడువు.. ప్రత్యామ్నాయంగా విజిటర్ వీసాలకు దరఖాస్తు

**వాటినీ తిరస్కరిస్తున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు**

వాషింగ్టన్: అమెరికాలో స్థిరపడాలనే కలలతో వెళ్లిన వేలాది మంది ఐటీ ఉద్యోగుల జీవితాలు ఇప్పుడు తలకిందులయ్యాయి. మెటా, అమెజాన్, ఒరాకిల్ వంటి అగ్రశ్రేణి కంపెనీల్లో జరుగుతున్న లేఆఫ్స్ అక్కడి భారతీయులను కోలుకోలేని దెబ్బ తీశాయి. అమెరికా వీసా నిబంధనల ప్రకారం కేవలం 60 రోజుల్లో కొత్త ఉద్యోగం దొరక్కపోతే దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి రావడంతో వారు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. అమెరికా ఇమ్మిగ్రేషన్ రూల్స్ ప్రకారం హెచ్-1బీ వీసాపై ఉన్న వ్యక్తి ఉద్యోగం కోల్పోతే, కొత్త స్పాన్సర్‌ను వెతుక్కోవడానికి కేవలం 60 రోజులు మాత్రమే సమయం ఉంటుంది. ప్రస్తుతం ఐటీ రంగంలో నియామకాలు మందగించడంతో ఈ లోపు మరో ఉద్యోగం సంపాదించడం కష్టంగా మారింది. దీంతో ఇళ్లు, పిల్లల చదువులు, లోన్లు ఉన్న ఎందరో భారతీయుల భవిష్యత్తు ఒక్కసారిగా ప్రశ్నార్థకంగా మారింది. ఈ 60 రోజుల గడువును మరికొంత కాలం పొడిగించుకోవడానికి చాలా మంది ఉద్యోగులు తాత్కాలికంగా బి-2 విజిటర్ వీసాలోకి మారేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల మరో ఆరు నెలల సమయం దొరుకుతుంది. అయితే ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ వాతావరణంలో అధికారులు దీనిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. అదనపు ఆధారాలు అడగటంతో పాటు, ఈ అప్లికేషన్లను భారీగా తిరస్కరిస్తున్నారని ఇమ్మిగ్రేషన్ లాయర్లు చెబుతున్నారు. అమెరికా హెచ్-1బీ వీసాలను అత్యధికంగా పొందుతున్నది భారతీయులే. హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ నివేదిక ప్రకారం గత ఆర్థిక సంవత్సరంలో ఆమోదించిన మొత్తం 4.06 లక్షల వీసాల్లో దాదాపు 2.83 లక్షలు భారతీయులకే దక్కాయి. ఇప్పుడు లేఆఫ్స్ వల్ల ఈ భారీ డిపెండెన్సీనే వారికి శాపంగా మారింది. దశాబ్దాలుగా గ్రీన్ కార్డ్ కోసం వేచి చూస్తున్న ఐటీ నిపుణులు ఇప్పుడు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.




# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

**కేంద్రానికి జమియత్ ఉలేమా చీఫ్ వినతి**



న్యూఢిల్లీ: ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించాలని జమియత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ అర్షద్ మదానీ బుధవారం అన్నారు. మైనారిటీ వర్గంపై జరుగుతున్న విద్వేషపూరిత ప్రసంగాలు, దాడుల వెనుక ఈ పవిత్ర జంతువు చుట్టూ అల్లుకున్న విభజన రాజకీయాలే మూలకారణమని ఆయన పేర్కొన్నారు. విద్వేష రాజకీయాలు, పెరుగుతున్న మూకదాడుల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆవును 'జాతీయ జంతువు'గా ప్రకటించడం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని మదానీ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని ఎవరు అడ్డుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. దేశంలోని మెజారిటీ వర్గం ఆవును పవిత్ర జంతువుగా మాత్రమే కాకుండా, తల్లిగా కూడా భావిస్తుందని తెలిపారు. ఆవు పేరుతో జరిగే రాజకీయ ఆట ఇకనైనా అంతం కావాలని ఆకాంక్షించారు. మతం పేరుతో జరిగే రాజకీయాల వల్ల ఎవరి ప్రాణాలు పోకూడదని అన్నారు. దేశంలో మత విభజన, విద్వేష రాజకీయాలకు శాశ్వత పరిష్కారం కావాలని అన్నారు. గోమాంసం విషయంలో వివిధ రాష్ట్రాలలో వివిధ చట్టాలు ఉన్నాయని గుర్తు చేశారు. మతవిద్వేషంతో కూడిన దాడులు భక్తి అనబడదని, రాజకీయ కుతంత్రాలు అన్నారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే మత విద్వేష సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఇందు కోసం అన్ని రాష్ట్రాల్లో ఒకే విధమైన చట్టం ఉండాలని అన్నారు.

## జమిలితో 7 లక్షల కోట్ల ఆదా

గాంధీనగర్: లోక్‌సభ, అసెంబ్లీలు, స్థానిక సంస్థల ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించడం వల్ల దాదాపు రూ.7 లక్షల కోట్లు ఆదా అవుతాయని, పాలనా సామర్థ్యంమెరుగుపడడంతోపాటు దేశ జీడీపీ వృద్ధి 1.6 శాతం వరకు పెరుగుతుందని జమిలి ఎన్నికలపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తెలిపింది. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో విలేకరుల సమావేశంలో జేపీసీ చైర్‌పర్సన్, లోక్‌సభ ఎంపీ పీపీ చౌదరి మాట్లాడుతూ ఏకకాల ఎన్నికల ప్రతిపాదనను అధ్యయనం చేసేందుకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో 8 మంది సభ్యుల కమిటీని ప్రధాని నరేంద్ర మోదీ నియమించారని తెలిపారు.

## హెచ్‌డీఎఫ్‌సీ వారంలో 2 రోజులు వర్క్‌ఫ్రం హోం

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ఉద్యోగులకు హైబ్రిడ్ వర్క్ మోడల్‌ను ప్రకటించింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చమురు సంక్షోభాన్ని నివారించేందుకు పొదుపు పాటించాలని, సంస్థలు వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని సూచించిన నేపథ్యంలో బ్యాంకు ఆ దిశగా అడుగులు వేస్తోంది. బ్యాంక్‌లోని బిజినెస్, కార్పొరేట్ సపోర్ట్ విభాగాల్లో పనిచేసే ఎంపిక చేసిన ఉద్యోగులకు వారంలో రెండు రోజుల వర్క్-ఫ్రమ్-హోమ్ అవకాశం కల్పించాం. ముఖ్యంగా బ్యాంకులోని ఇంటర్నల్ విభాగాలు హెచ్‌ఆర్, ఫైనాన్స్, ట్రెజరీ ఆపరేషన్స్, బ్యాంకు లావాదేవీలు చూసే ఉద్యోగులకు ఇది వర్తిస్తుంది. ఈ నిర్ణయం ఇప్పటికే అమల్లోకి వచ్చిందని, వచ్చే 30 రోజుల పాటు ట్రయల్ బేసిస్‌పై కొనసాగుతుందని బ్యాంకు తెలిపింది. ఆ తర్వాత పరిస్థితులను బట్టి సమీక్ష ఆధారంగా కొనసాగించడంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అయితే ఈ మార్పు కస్టమర్లతో నేరుగా పని చేసే బ్రాంచ్ ఉద్యోగులపై ప్రభావం చూపదని, బ్యాంకింగ్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని స్పష్టం చేసింది.

## మార్కెట్లకు లాభాల పంట

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ తీవ్ర ఒడిదుడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. రోజంతా నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు.. చివరి గంటలో అనూహ్యంగా పుంజుకున్నాయి. ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో నష్టాలను చెరిపేసి లాభాల్లోకి మళ్లాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 117.54 పాయింట్లు (0.16%) లాభపడి 75,318.39 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు (0.17%) పెరిగి 23,659 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ 74,529.41 కనిష్ఠ స్థాయికి పడిపోయి, ఆ తర్వాత 75,406.18 గరిష్ఠ స్థాయికి చేరింది. నిఫ్టీ కూడా 23,397.30 కనిష్టాన్ని తాకి, తిరిగి కోలుకుంది. నిఫ్టీలో హిందాల్కో ఇండస్ట్రీస్, బజాజ్ ఆటో షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచి మార్కెట్ రికవరీకి దోహదపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఆటో, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు రాణించగా, నిఫ్టీ మీడియా, నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ సూచీలు నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.49% లాభపడగా, స్మాల్‌క్యాప్ 0.04% లాభంతో ఫ్లాట్‌గా ముగిసింది.

## వర్క్‌ఫ్రం హోం అన్నారు.. ఉద్యోగమే తీసేశారు!

న్యూయార్క్: ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం మెటాలో ఉద్యోగ తొలగింపులు ప్రారంభమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగులలో పది శాతం మందిని తొలగించనున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇందులో చాలామందికి తొలుత వర్క్ ఫ్రమ్ హోమ్ అని చెప్పి హఠాత్తుగా లేఆఫ్ మెయిల్స్ పంపించినట్లు తెలుస్తోంది. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సింగపూర్, అమెరికా, యూకే వంటి ప్రాంతాల్లోని ఉద్యోగులకు మొదట ఇంటి నుంచి పని చేయాలని కంపెనీ సూచించింది. అందుకు వారు సిద్ధమవుతుండగా, వేకువజామున వారికి లేఆఫ్ మెయిల్స్ పంపించింది. అయితే ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేందుకు సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తొలగింపుకు గురవుతున్న వారిలో ఎక్కువమంది ఇంజినీరింగ్, ప్రోడక్ట్ బృందాలు ఉన్నాయి. మెటా తన సింగపూర్‌లోని టీమ్‌కు మొదట మెయిల్స్ పంపించింది. వారికి వేకువజామునే ఈ మెయిల్స్ అందాయి. ఈ తొలగింపుకు ముందు ప్రపంచవ్యాప్తంగా మెటాలో దాదాపు 78 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. తాజాగా పది శాతం ఉద్యోగులకు లేఆఫ్ మెయిల్స్ వచ్చాయంటే సుమారు 8 వేల మందిని తొలగించనుంది.

## గూగుల్ ఏఐ ప్రభంజనం

**85 లక్షల మంది డెవలపర్లు వాడకం**

**90 కోట్లకు జెమిని నెలవారీ యూజర్లు**

న్యూయార్క్: టెక్నాలజీ దిగ్గజం ఆల్ఫాబెట్ నేతృత్వంలోని గూగుల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. తమ ఏఐ మోడళ్లను ఉపయోగించి 85 లక్షల మందికి పైగా డెవలపర్లు యాప్స్, ఇతర సేవలను రూపొందిస్తున్నారని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నామని, ఈ ఏడాది క్యాపిటల్ వ్యయం సుమారు 190 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఈ నిధులను ప్రధానంగా ఏఐ డేటా సెంటర్లు, కస్టమ్ సిలికాన్, మోడల్ ట్రైనింగ్ కోసం కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. డెవలపర్లు, ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు సాధారణ వినియోగదారుల నుంచి కూడా తమ ఏఐ సేవలకు డిమాండ్ వేగంగా పెరుగుతోందని పిచాయ్ వివరించారు. గూగుల్ జెమిని యాప్ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య గతేడాదితో పోలిస్తే రెట్టింపు అయి, ప్రస్తుతం 90 కోట్లకు చేరిందని పేర్కొన్నారు. అలాగే, ఏఐ ఓవర్‌వ్యూస్ ఫీచర్‌ను నెలకు 250 కోట్ల మంది, ఏఐ మోడ్‌ను 100 కోట్ల మందికి పైగా వినియోగిస్తున్నారని తెలిపారు.

## మోదీ దేశద్రోహి

**ప్రధానిపై రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు**

రాయ్‌బరేలీ: ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మోదీ 'దేశద్రోహి' అని విమర్శించారు. దేశాన్ని అమ్మేశారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సొంత నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో ఓ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన బుధవారం ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎండను సైతం లెక్కచేయకుండా వచ్చిన మీకు ధన్యవాదాలు. ఇంటికి వెళ్లాక మీ దగ్గరకు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వచ్చి మోదీ, అమిత్ షా గురించి మాట్లాడితే దీటుగా సమాధానం ఇవ్వండి. మీ ప్రధాని, హోంమంత్రి, మీ సంస్థ దేశద్రోహులని వారికి చెప్పండి. వాళ్లు దేశాన్ని అమ్మేయడానికి పనిచేస్తున్నారని తెలియజేయండి. మన వ్యవస్థలపై దాడి చేస్తున్నారని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, అంబేద్కర్, వీర్ పాసి, మహాత్మా గాంధీని విమర్శిస్తున్నారని చెప్పండి" అంటూ రాహుల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ ధరలు మళ్లీ పెరుగుతాయని రాహుల్ అంచనా వేశారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సామాన్యులు అల్లాడిపోతున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వ వైఫల్యం వల్ల త్వరలో ఆర్థిక తుపాను రాబోతోందని పునరుద్ఘాటించారు. దీనికి మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్సే కారణమన్నారు. రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఆయన వ్యాఖ్యలు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని ఆక్షేపించింది. దేశ ప్రజలను రాహుల్ అవమానిస్తున్నారంటూ మండిపడింది.

## 27, 28 తేదీల్లో 'హైబ్రిడ్'లో టీడీపీ మహానాడు

మంగళగిరి, మే 20 (ఈవార్తలు): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు' ఈనెల 27, 28 తేదీల్లో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా 'హైబ్రిడ్' (వర్చువల్, ఫిజికల్) పద్ధతిలో జరగబోతోందని టీడీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రకటించారు. పార్టీ స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు 37 మహానాడులు విజయవంతంగా జరిగాయని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ, మొదట ఈ మహానాడును నెల్లూరులో భారీ ఎత్తున నిర్వహించాలని ప్రణాళికలు సిద్ధం చేశామని, నెల్లూరులో జరిగి ఉంటే దాదాపు 7 వేల బస్సులు, వేలాది కార్లు, ట్రక్కులు వచ్చేవని అన్నారు. అయితే, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో వాహనాల సంఖ్యను తగ్గించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును గౌరవిస్తూ, దేశంలో ఇంధన (పెట్రోల్, డీజిల్) కొరతను దృష్టిలో ఉంచుకుని, ఈ నిర్ణయాన్ని ఏపీలోనూ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావించారని అన్నారు.

## ఉగ్రవాదుల్లా రాహుల్ భాష: బీజేపీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ సంస్థ 'దేశద్రోహులు' అని ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు సూచించడం తీవ్ర దుమారం రేపింది. ఆర్థిక సంక్షోభం వల్ల దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుకుంటూ బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. పొదుపు కోసం పిలుపునిచ్చిన ప్రధానియే వాటిని పాటించడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. రాహుల్ గాంధీ వాడిన భాష పాకిస్థాన్, ఆ దేశానికి మద్దతిచ్చే ఉగ్రవాదుల భాషను పోలి ఉందని బీజేపీ మండిపడింది. ఆయన వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. అక్కడి నేతలు చెప్పినట్లుగానే రాహుల్ గాంధీ మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిని అవమానించడం అతడికి అలవాటుగా మారిందని అన్నారు. రాహుల్ గాంధీ భాష పాకిస్థాన్ నాయకుల భాషలా ఉందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి ప్రపంచానికి తెలుసని, రాహుల్ గాంధీ నుంచి ప్రశంసలు అవసరం లేదని విమర్శించారు. దేశంలో అశాంతిని రగల్చాలని రాహుల్ గాంధీ కోరుకుంటున్నారని అన్నారు. కానీ మోదీ, అమిత్ షాలకు ప్రజలు అండగా ఉన్నారని అన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ మరిచిపోకూడదని వ్యాఖ్యానించారు.

## బయోమెట్రిక్ లేకుండానే రేషన్

అమరావతి, మే 20 (ఈవార్తలు): ఏపీలో రేషన్ పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ఇప్పటివరకు ఉన్న విధానానికి భిన్నంగా, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (సీబీడీసీ) ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ అయిన అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గుజరాత్‌లోని నాలుగు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలవుతున్న ఈ విధానాన్ని, త్వరలోనే రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలలో కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సీబీడీసీ విధానం ప్రకారం.. రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఒక డిజిటల్ వ్యాలెట్ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ డబ్బును డిజిటల్ రూపాయి రూపంలో నేరుగా లబ్ధిదారుల వ్యాలెట్‌కు జమ చేస్తుంది. లబ్ధిదారులు ఆ డిజిటల్ డబ్బుతో రేషన్ దుకాణాల్లో తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేయవచ్చు. ఈ విధానంలో బయోమెట్రిక్ అవసరం కూడా ఉండదు. దీనివల్ల ప్రభుత్వ సబ్సిడీ ఎంత వస్తుందో లబ్ధిదారులకు, తమ మార్జిన్ ఎంత వస్తుందో డీలర్లకు స్పష్టత ఉంటుందని మంత్రి వివరించారు. రేషన్ పంపిణీతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు మంత్రి మనోహర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద ఇకపై సన్న బియ్యానికి బదులుగా నాణ్యమైన స్టీమ్డ్ రైస్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ఆమోదం తెలిపారన్నారు.

## త్వరలో మనుష్యుల కంటే తెలివైన ఏఐ

**గూగుల్ ఏఐ చీఫ్ కీలక వ్యాఖ్యలు**

న్యూయార్క్: మనుషుల కంటే తెలివైన రోబోలు రాబోతున్నాయంటూ గూగుల్ ఏఐ చీఫ్ డెమిస్ హసాబిస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గూగుల్ వార్షిక ఈవెంట్ ఐఓ స్టేజీపై ఆయన మాట్లాడిన మాటలు ఇప్పుడు టెక్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారాయి. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ గురించి డెమిస్ కీలక విషయాలు పంచుకున్నారు. మానవ మేధస్సును మించిపోయే ఆ సాంకేతికత మనకు చాలా దగ్గర్లోనే ఉందని ఆయన చెప్పారు. భవిష్యత్తులో ప్రపంచంలోని అన్ని రకాల రోగాలను నయం చేసే లక్ష్యంతో దీనిని తయారు చేస్తున్నట్లు ప్రకటించారు. మనమంతా ఇప్పుడు సరికొత్త టెక్నాలజీ యుగం అంచున ఉన్నామని వివరించారు. భవిష్యత్తులో ఇంటర్నెట్ వాడకం ఎంత సులువుగా మారుతుందో డెమిస్ ఈ కార్యక్రమంలో డెమో చూపించారు. మన తరఫున ఆన్‌లైన్ షాపింగ్ చేయడం, పనులను ట్రాక్ చేయడం, పక్కనే కూర్చున్న అసిస్టెంట్‌లా వెబ్‌లో సమాచారాన్ని వెతకడం లాంటి పనులను ఏఐ ఈజీగా చేసేస్తుందన్నారు. ఈ ప్రోగ్రాంకు హాజరైనవాళ్లను ఈ ఫీచర్లు ఎంతగానో ఆకట్టుకున్నాయి.



# సగం సగం భూములేంది?

## పాఠశాలకు పూర్తి స్థలం ఎందుకు కేటాయించలేదు?.. యంగ్ ఇండియా స్కూల్ భూ కేటాయింపుపై జీవన్ రెడ్డి ఫైర్

జగిత్యాల బ్యూరో, మే 20 (ఈవార్తలు): కేంద్రీయ విద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లకు భూముల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జగిత్యాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి అవసరమైన 5 ఎకరాల భూమి బదులుగా కేవలం 2 ఎకరాలు మాత్రమే ఎందుకు కేటాయించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు అవసరమైన 20 ఎకరాల స్థానంలో కేవలం 10 ఎకరాలకే పరిమితం చేయడంలో ఎమ్మెల్యే పాత్ర ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. 20 ఎకరాల భూమి అవసరం ఉన్నప్పటికీ దానిని 10 ఎకరాలకు కుదించడాన్ని ప్రశ్నించిన ఆయన, పూర్తి స్థలం కేటాయించకుండా పాలాభిషేకాలు చేసుకోవడం ఎందుకని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే కనుసన్నల్లో నడుస్తుంటే పూర్తి స్థాయిలో భూమి కేటాయించకపోవడం వెనుక కారణాలు ఏమిటని ప్రశ్నించారు. జగిత్యాల పట్ల సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్య వైఖరి, వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణానికి ఒక్కో స్కూల్‌కు రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నారని, మొత్తం 100 పాఠశాలల కోసం సుమారు రూ.20 వేల కోట్లు వెచ్చిస్తున్నారని తెలిపారు. ఇంత భారీ స్థాయిలో చేపడుతున్న నిర్మాణ పనులు ఎవరి ప్రయోజనాల కోసం జరుగుతున్నాయో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. స్థానిక కాంట్రాక్టర్లకు అవకాశాలు కల్పించకుండా భారీ పనులు కొద్దిమందికే పరిమితం చేస్తున్నారని



ఆరోపించారు. జగిత్యాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, చల్ గల్ సర్పంచ్ జున్ను రాజేందర్, ముక్క సిర్ అలీ నిహాల్, మాజీ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, శివ కేసరి బాబు కౌన్సిలర్, దుర్గయ్య, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాయికల్‌లో అమృత్ 2.0 పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

రాయికల్, మే 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా రూ.15.20 కోట్లతో చేపట్టనున్న మంచినీటి సరఫరా పనులకు, రూ.3.14 కోట్లతో చేపట్టనున్న పెద్ద చెరువు పునరుద్ధరణ పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్, వైస్ చైర్మన్ తురగా సౌజన్య శ్రీధర్ రెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపల్లి గంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కమిషనర్ మనోహర్ గౌడ్, ఎంపీడీవో చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమాన్లు, మాజీ వైస్ చైర్మన్ రమాదేవి అచ్యుతరావు, కౌన్సిలర్లు, నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## 24 గంటల్లో ధాన్యం అన్‌లోడ్ అవ్వాలి

**మిల్లర్లకు జగిత్యాల కలెక్టర్ ఆదేశాలు**

జగిత్యాల, మే 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని శక్తి రైస్ మిల్, అంతర్గాం, మోరపల్లి, మేడిపల్లి మండలంలోని సురభి సూర్య రైస్ మిల్, మాచాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లులకు చేరిన ధాన్యంతో వచ్చిన లారీలను 24 గంటల్లో అన్‌లోడ్ చేసి తిరిగి పంపించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచి ధాన్యాన్ని రక్షించాలని సూచించారు. రైస్ మిల్లులలో నిల్వలు, మిల్లింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, డీసీఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బాలిక మృతి కేసులో నిందితుడికి ఆర్నెల్ల జైలు



జగిత్యాల/కోరుట్ల, మే 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి గౌరవ న్యాయస్థానం 6 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోరుట్ల మండలానికి చెందిన ఆకుల బోజన్న తన మనుమరాలు ధరిణి (5)తో కలిసి 2019 ఫిబ్రవరి 19న పైడిమడుగు గ్రామం నుంచి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో కల్లూరు వైపు నుంచి కోరుట్లకు వస్తున్న ట్రాక్టర్‌ను పోగుల భూమయ్య అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి టీవీఎస్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బోజన్నకు గాయాలు కాగా, చిన్నారి ధరిణికి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందింది. ఘటనపై బాలిక తండ్రి ఆకుల నరేష్ ఫిర్యాదు మేరకు కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన కోరుట్ల జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి పావని, సాక్ష్యాధారాలను పరిశీలించి నిందితుడు పోగుల భూమయ్యను దోషిగా నిర్ధారిస్తూ 6 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

## బుగ్గారం కాంగ్రెస్ నూతన కార్యవర్గం నియామకం

బుగ్గారం/జగిత్యాల, మే 20 (ఈవార్తలు): బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నగునూరి నర్సగౌడ్, జనరల్ సెక్రటరీగా మద్దునూర్ మాజీ సర్పంచ్ బత్తుల తిరుపతి నియమితులయ్యారు. బుధవారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య వారికి నియామక పత్రాలు అందజేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు నందయ్య తెలిపారు. పార్టీ బలోపేతం, రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరినీ కలుపుకొని పనిచేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు.



## అనుమానాస్పద వ్యక్తులకు గదులు ఇవ్వొద్దు

### గుర్తింపు పత్రాలు తప్పనిసరి: జగిత్యాల సీఐ కరుణాకర్

జగిత్యాల టౌన్, మే 20 (ఈవార్తలు): అనుమానాస్పద వ్యక్తులకు లాడ్జిల్లో గదులు కేటాయించవద్దని, ప్రతి వ్యక్తి నుంచి చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ కరుణాకర్ సూచించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత దృష్ట్యా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జ్ యజమానులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లాడ్జ్ నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాల్సిన భద్రతా నిబంధనలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. గదులు కేటాయించే ముందు ప్రతి వ్యక్తి నుంచి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. వారి పూర్తి వివరాలను రిజిస్టర్లలో నమోదు చేసి భద్రపరచడంతో పాటు, అవసరమైన సమయంలో పోలీసులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. లాడ్జ్ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఐ సూచించారు. ముఖ్యంగా ప్రవేశ ద్వారాలు,



రిసెప్షన్ ప్రాంతం, పార్కింగ్ స్థలాలు, కారిడార్లలో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి 24 గంటల పాటు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని తెలిపారు. సీసీ ఫుటేజ్‌ను నిర్దిష్ట కాలం పాటు భద్రపరచే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సరైన గుర్తింపు పత్రాలు లేని వారికి లేదా అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులకు గదులు కేటాయించవద్దని స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం వల్ల నేరాలకు అవకాశం కలిగే ప్రమాదం ఉందని, లాడ్జ్ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా, ఏవైనా అనుమానాస్పద కదలికలు లేదా వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన లాడ్జ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ భద్రతలో లాడ్జ్ నిర్వాహకుల సహకారం కీలకమని, ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని సీఐ కరుణాకర్ సూచించారు.

## రోడ్డు నిర్మాణంలో నాణ్యత కనిపించాలి

**: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**

జగిత్యాల టౌన్, మే 20 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 42వ వార్డులో రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే జగిత్యాలలో రూ.62 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. పట్టణ అభివృద్ధిలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, చేపట్టే ప్రతి పనిలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పార్కు సంధి ప్రాంతంలోని దుకాణదారులు చెత్తను ఇష్టారీతిన రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. కొత్తగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు పక్కన వర్షపు నీరు సులభంగా వెళ్లేలా



ధోనీ తరహాలో కాలువలు ఏర్పాటు చేయాలని, తద్వారా రోడ్లు త్వరగా దెబ్బతినకుండా ఉంటాయని అన్నారు. అదేవిధంగా జగిత్యాల పట్టణంలో ట్రేడ్ అనుమతులు మంజూరు చేసి మున్సిపాలిటీ ఆదాయం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, కౌన్సిలర్ నాగరాజు, బొలుసాని శ్రీనివాస్, డీఈ ఆనంద్, నాయకులు సమీండ్ల శ్రీనివాస్, దాసరి ప్రవీణ్, పోతునుక మహేష్, రాజు, కప్పల శ్రీకాంత్, ఈశ్వర్, ఏఈ అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## అంజన్న గుడి పాత సామాను వేలం

మల్యాల, మే 20 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పనికి రాని సామగ్రి అయిన అల్యూమినియం, ఇనుము సామగ్రిని వేలం వేశారు. అల్యూమినియాన్ని ఉప్పుల సమ్మయ్య కిలో కు రూ.240 చొప్పున, ఇనుప సామగ్రి అనుముల కనకయ్య కిలో కు రూ 26.50 చొప్పన కైవసం చేసుకొన్నారు. అటు.. పెద్ద జయంతి సందర్భంగా భక్తులు సమర్పించిన ముడుపులు లెక్కింపు చేయగా రూ.2,93,972 ఆదాయం చేకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి, ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్, రామేశ్వర రావు, శ్రీనివాస్, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ అనూష ఉన్నారు.



## బస్టాండులో బండ్లు.. రోడ్డున జనాలు!

పార్కింగ్ స్థలంగా మల్యాల ఎక్స్ రోడ్డు బస్టాండు

మల్యాల, మే 20 (ఈవార్తలు): జగిత్యాల – కరీంనగర్ రహదారిపై మల్యాల ఎక్స్ రోడ్ వద్ద ఉన్న బస్టాండ్ వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారిపోయింది. దీంతో ఎండలోనూ ప్రయాణికులు బయటే ఉండి బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి తలెత్తుతోంది. బస్టాండులో కూర్చోవడానికి సరైన సదుపాయం లేకపోవడంతో పాటు.. దుమ్ము, చెత్తతో నిండిపోయింది. నిర్వాహకులు దాన్ని శుభ్రం చేసిన పాపాన పోలేదు. దీంతో ఖాళీగానే ఉంటోంది కదా అని.. వాహనదారులు బస్టాండును పార్కింగ్ కోసం వాడుతున్నారు. అక్కడ వాహనాలు నిలపొద్దని మల్యాల పోలీసులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోవడం గమనార్హం. మల్యాల మండల కేంద్రానికి ప్రధాన మార్గంగా ఉన్న ఈ ఎక్స్ రోడ్ బస్టాండ్‌ను వెంటనే అభివృద్ధి చేసి, ప్రయాణికుల కోసం సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



## బీరయ్య-కామరాతి మహోత్సవాల్లో ఎమ్మెల్యే

జగిత్యాల రూరల్, మే 20 (ఈవార్తలు): బీరయ్య-కామరాతి బోనాలు, పట్నాలు గొల్ల కురుమల ఆత్మగౌరవానికి ప్రతీకలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. పవిత్ర సంప్రదాయాలను, ఒగ్గు కళను కాపాడుకుంటూనే గొల్ల కురుమ సంఘం గ్రామ ఐక్యతను చాటడం ఈ పండుగల ప్రత్యేకత అని పేర్కొన్నారు. జగిత్యాల మండలం గొల్లపల్లె గ్రామంలో నిర్వహించిన బీరయ్య–కామరాతి కళ్యాణ మహోత్సవం, మహంకాళి బోనాలు–పట్నాల మహోత్సవ కార్యక్రమాలకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పండుగలు గ్రామ సంస్కృతి, ఐక్యతకు ప్రతిబింబాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రకాష్, ఉప సర్పంచ్ తిరుపతి, కౌన్సిలర్ చెట్టే గంగాధర్, మాజీ ఎంపీటీసీ శంకర్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీకాంత్, శ్రీనివాస్, గంగ మల్లయ్య, గొల్ల కురుమ సంఘం పెద్దలు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మేడం వచ్చిన టైమే ఆఫీస్ టైం!

**జగిత్యాల ఎస్ఆర్వోపై ఫిర్యాదులు**

జగిత్యాల బ్యూరో, మే 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆందోళన చేపట్టారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వేచి చూసినా రిజిస్ట్రేషన్లు పూర్తి కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మొత్తం 48 స్లాట్లు బుక్ కావడంతో కార్యాలయంలో తీవ్ర రద్దీ నెలకొంది. కార్యాలయంలో కేవలం ముగ్గురు సిబ్బందితోనే పనులు కొనసాగుతుండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యమవుతోందని ప్రజలు తెలిపారు. జగిత్యాల ఎస్ఆర్వో సుజాత ఆలస్యంగా కార్యాలయానికి వచ్చి సాయంత్రం 4 గంటలకే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్లు సమయానికి పూర్తి కావడం లేదని పలువురు విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లలతో వచ్చిన మహిళలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.



## ప్రేమ జంట, కుటుంబాలు వెలి

### ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో దారుణం

ఎన్టీఆర్ జిల్లా, మే 20 (ఈవార్తలు): ఆధునిక సమాజంలో ఇంకా కొనసాగుతున్న అనాగరిక కట్టుబాట్లకు అద్దం పడుతూ ఎన్టీఆర్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక సామాజిక బహిష్కరణ (వెలివేత) ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన తేజ, నాగలక్ష్మి అనే యువతీయువకులు ప్రేమ వివాహం చేసుకోవడమే వారు చేసిన నేరమైంది. వీరి పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించిన గ్రామ కుల పెద్దలు, సదరు జంటతో పాటు వారి కుటుంబాలను సామాజికంగా వెలివేస్తూ అత్యంత దారుణమైన నిర్ణయం తీసుకున్నారు. ఆ కుటుంబాలతో గ్రామంలో ఎవరూ మాట్లాడకూడదని, వారి ఇళ్లకు వెళ్లకూడదని, నిబంధనలు ధిక్కరిస్తే ఏకంగా రూ. 2 లక్షల భారీ జరిమానా విధిస్తామని ఊరిలో చాటింపు వేయించడం గమనార్హం. పెద్దల వేధింపులు భరించలేక ప్రేమ జంట ఊరు విడిచి వెళ్లిపోయినప్పటికీ, ఇక్కడ మిగిలిపోయిన అమ్మాయి కుటుంబానికి మాత్రం కష్టాలు తీరలేదు. ఇటీవల ఆ జంటకు బాబు పుట్టడంతో కుటుంబ సభ్యులు బారసాల వేడుక నిర్వహించారు. అయితే ఆ వేడుకకు ఎవరూ వెళ్లకూడదని గ్రామ పెద్దలు మరోసారి ఆంక్షలు విధించారు. చివరికి శుభలేఖలు ఇవ్వడానికి వెళ్లిన కుటుంబ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, గ్రామ తీర్పును ఉల్లంఘించారనే నెపంతో రూ. 2 లక్షలు జరిమానా కట్టాలని హుకుం జారీ చేశారు. ఈ అన్యాయంపై బాధితులు మైలవరం పోలీసులను ఆశ్రయించినా సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘోరంపై సోషల్ మీడియాలో, సామాజిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. చట్టాలు ఎంత కఠినంగా ఉన్నా, గ్రామాల్లో ఇలాంటి సమాంతర న్యాయస్థానాలు నడుస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాయడంపై మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనాగరిక చర్యలకు పాల్పడిన గ్రామ పెద్దలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

లవ్లీ చిత్రం



నభా నటేష్




# ఎప్‌సెట్ టాపర్‌ను సత్కరించిన చిరు

"నువ్వు స్టేట్ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకో.. నిన్ను మెగాస్టార్ చిరంజీవి దగ్గరకు తీసుకెళ్లి ఆశీర్వాదం ఇప్పిస్తా" అని ఒక తండ్రి తన కూతురికి ప్రామిస్ చేశారు. పట్టుదలతో కష్టపడి చదివిన ఆ అమ్మాయి తెలంగాణ ఎప్‌సెట్‌లో స్టేట్ టాపర్‌గా నిలిచింది. తాజాగా ఆ 'మెగా' కల కూడా నిజమైంది. తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాల్లో సంచలనం సృష్టించిన ఎం.రుషి వెనక ఓ ఆసక్తికరమైన కథ ఉంది. రుషి తండ్రి చిన్నప్పటి నుంచి చిరంజీవికి పెద్ద అభిమాని. రుషికి కూడా మెగాస్టార్ అంటే చాలా ఇష్టం. దీంతో ఎప్‌సెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిస్తే స్వయంగా ఆయన దగ్గరకు తీసుకెళ్లి కల్పిస్తానని తండ్రి మాటిచ్చారు. కష్టపడి చదివిన రుషి స్టేట్ టాపర్‌గా నిలిచింది. రుషి సాధించిన ఈ విజయం సాధారణమైనది కాదు. ఇంజినీరింగ్ విభాగంలో గత 40 ఏళ్లుగా (1986 తర్వాత) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఏకైక అమ్మాయిగా రుషి రికార్డు సృష్టించింది. మగపిల్లలదే హవా అనుకునే ఈ విభాగంలో ఓ అమ్మాయి టాపర్‌గా నిలవడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. తనను కలవడానికి వచ్చిన ఈ యంగ్ అచీవర్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. రుషి సాధించిన అద్భుతమైన విజయాన్ని అభినందిస్తూ ఆమెను శాలువాతో సత్కరించారు. ల్యాప్‌టాప్ బహుమానంగా ఇచ్చారు. ఇంత చిన్న వయసులోనే తండ్రి మాట కోసం అంతటి కఠినమైన పరీక్షలో టాప్ ర్యాంక్ సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ అధికారిణి కావాలన్నదే తన లక్ష్యమని రుషి చిరంజీవికి వివరించింది. ఆమె సంకల్పాన్ని విన్న మెగాస్టార్ ఎంతో సంతోషించారు. రుషి చదువును ఆపొద్దని.. తన నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా మొహమాటం లేకుండా అడగాలని భరోసా ఇచ్చారు.

# పెద్దికి యూ/ఏ సర్టిఫికెట్

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల ట్రైలర్ రిలీజ్ చేసి సోషల్ మీడియాను, యూట్యూబ్‌ను షేక్ చేయడంతో పాటు రికార్డ్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుంది. ఈనేపథ్యంలో.. తాజాగా, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. 'పెద్ది' సినిమాను చూసిన సెన్సార్ బోర్డ్ సభ్యులు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇక ఈ చిత్రం రన్‌టైన్ విషయానికొస్తే.. సుమారు 3గంటల 2 నిమిషాలు ఉన్నట్లు సమాచారం. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ మూవీ ఎక్కడా బోర్ కొట్టకుండా ఉంటుందని టాక్. గూస్‌బంప్స్ తెప్పించే ఎలిమెంట్స్‌తో సినిమా అదిరిపోయిందంటున్న ఇన్‌సైడ్ టాక్. జూన్ 4న రాబోతుండగా.. ఒకరోజే ముందుగానే జూన్ 3న ప్రీమియర్స్ తో ప్రేక్షకుల ముందుకు పెద్ది రాబోతుంది. ఇక ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తుండగా.. జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు, ఇషాన్ సక్సెనా ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ ఈ మూవీకి సంగీతం అందిస్తుండటం విశేషం.






# ఎన్‌బీకే 111లో మంచు మనోజ్

'వీర సింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత బాలయ్య, గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతోన్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటుడు మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్న దర్శకుడు, మనోజ్ పోషించబోయే పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని, థియేటర్లలో ఆ మ్యాజిక్‌ను ప్రేక్షకులు ఎప్పుడు చూస్తారా అని తాను ఎంతగానో ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. కాగా ఈ సినిమాలో మనోజ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. గతంలో 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో కలిసి నటించిన బాలకృష్ణ, మంచు మనోజ్ మళ్లీ కలిసి నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# చిక్కుల్లో ధురంధర్ 2

బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన బాలీవుడ్ భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' చుట్టూ ఇప్పుడు చట్టపరమైన వివాదం ముసురుకుంది. ఈ సినిమాలో సాయుధ దళాల రహస్యాలను, వారి కార్యకలాపాలకు సంబంధించిన సున్నితమైన వివరాలను బహిర్గతం చేశారని, దీనివల్ల దేశ భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందంటూ ఢిల్లీ హైకోర్టులో ఒక ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. సశస్త్ర సీమా బల్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దీపక్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే బుధవారం ఈ కేసుపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమా అనేది కల్పిత కథ ఆధారంగా తెరకెక్కినప్పటికీ.. దేశ భద్రతా దళాల్లో పనిచేస్తున్న సిబ్బంది వ్యక్తం చేసిన ఆందోళనలను, అభ్యంతరాలను అంత తేలికగా తీసిపారేయలేం.





# డ్రాగన్ నయా లుక్ గూస్‌బంప్స్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో వస్తున్న సినిమా డ్రాగన్. ఈ చిత్రంలో సప్తసాగరాలు దాటి ఫేం రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. తారక్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ విడుదల చేసిన గ్లింప్స్ ఇప్పటికే నెట్టింట హైప్ క్రియేట్ చేస్తోంది. తారక్ అభిమానులకు పుట్టినరోజు డబుల్ బొనాంజా ట్రీట్ ఇస్తూ మరో పోస్టర్ విడుదల చేశాడు. స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో బూట్‌కట్ ట్రౌజర్స్ వేసుకున్న జూనియర్ ఎన్టీఆర్ చేతిలో పదునైనా ఆయుధాన్ని పట్టుకోగా.. చుట్టూ మంటలు, పొగను చూడొచ్చు. మోకాళ్లపై కూర్చొని యాక్షన్ ప్యాక్‌డ్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నాడు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ ఆఫ్ఘన్ ట్రేడింగ్ కంపెనీకి చెందిన 'అసాసిన్–ఇన్–చీఫ్' (ప్రధాన హంతకుడు/షార్ప్ షూటర్) గా కనిపించబోతున్నాడు. ఆ తర్వాత, డెవిల్ పుట్టింది.. మా లూగర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు.. సినిమా వేడుకను అందించేందుకు డ్రాగన్ జూన్ 11, 2027న హద్దులు దాటబోతుంది.



# అల్లు అర్జున్‌పై కృతి సనన్ కన్ను

కృతి సనన్ టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకుంది. "ఒక నటుడిగా నాకు అల్లు అర్జున్ అంటే ఎంతో ఇష్టం. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, నటన అద్భుతంగా ఉంటాయి. నిజంగానే ఆయన చాలా గొప్ప నటుడు. బన్నీతో కలిసి ఒక సినిమా చేయాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. రండి మిత్రులారా, మీరందరూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి అయినా సరే దయచేసి మా కాంబోలో సినిమా నిజమయ్యేలా చేయండి" అంటూ కృతి ఐకాన్ స్టార్ అభిమానులను రిక్వెస్ట్ చేయడం గమనార్హం. కృతి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా.. నిజానికి కృతి సనన్ కెరీర్ ప్రారంభమైంది టాలీవుడ్ తోనే. మహేష్ బాబు సరసన '1 నేనొక్కడినే' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత 'దోచేయ్' లో నాగచైతన్య సరసన నటించగా.. 'మిస్టర్ మజ్ను' లో స్పెషల్ సాంగ్ చేసింది. అలాగే పాన్-ఇండియా చిత్రం 'ఆదిపురుష్' వంటి సినిమాలు చేసినప్పటికీ మంచి గుర్తింపు వచ్చింది కానీ, తెలుగులో ఆమెకు సరైన సక్సెస్ మాత్రం దక్కలేదు.






# గట్టెక్కిన కేకేఆర్

## ముంబైపై ఘన విజయం.. ప్లే ఆఫ్ ఆశలు సజీవం

ముంబయితో జరిగిన అత్యంత కీలకమైన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు 4 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో కోల్‌కతా జట్టు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించే అవకాశాలను సజీవంగా మిగిలాయి అని చెప్పవచ్చు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టును కోల్‌కతా బౌలర్లు తక్కువ పరుగులకే కట్టడి చేశారు.



ముంబయి బ్యాటర్లలో కార్బిన్ బోష్ మాత్రమే 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో వేగంగా ఆడి 32 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఫలితంగా ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులకే పరిమితం అయింది. అనంతరం 148 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ 18.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. పిచ్ బ్యాటింగ్‌కు అంతగా సహకరించకపోవడంతో స్వల్ప లక్ష్యమే అయినప్పటికీ పరుగులు తీయడానికి కోల్‌కతా బ్యాటర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. అయితే మిడిల్ ఆర్డర్‌లో మనీష్ పాండే (45), అలాగే పావెల్ (40) పరుగులత రాణించి జట్టును విజయతీరాలకు చేర్చారు. ముంబయి బౌలర్లలో కార్బిన్ బోష్ బ్యాటింగ్‌తోనే కాకుండా బౌలింగ్‌లోనూ రాణించి 3 వికెట్లు పడగొట్టగా, దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ఘజన్ ఫర్ చెరో వికెట్ తీసుకున్నారు. ఈ టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుకు ఇది ఆరో విజయం కాగా, ముంబయి జట్టుకు ఇది తొమ్మిదో ఓటమిగా నమోదైంది. ఈ విజయంతో లభించిన రెండు పాయింట్లతో కోల్‌కతా జట్టు మొత్తం 13 పాయింట్లను సాధించి, పాయింట్ల పట్టికలో 8వ స్థానం నుండి నేరుగా ఆరో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం కోల్‌కతాకు లీగ్ దశలో ఇంకొక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. ప్లే ఆఫ్స్ చేరాలంటే ఖచ్చితంగా గెలవాల్సిన ఆ చివరి మ్యాచ్‌లో మే 24న కోల్‌కతా జట్టు దిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 13 | 9 | 4 | 18 |
| గుజరాత్ | 13 | 8 | 5 | 16 |
| హైదరాబాద్ | 13 | 8 | 5 | 16 |
| రాజస్థాన్ | 13 | 7 | 6 | 14 |
| పంజాబ్ | 13 | 6 | 6 | 13 |
| కోల్‌కతా | 13 | 6 | 6 | 13 |
| చెన్నై | 13 | 6 | 7 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| ముంబై | 13 | 4 | 9 | 8 |
| లక్నో | 13 | 4 | 9 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు



## భారత్ ర్యాంకు డౌన్

డబ్ల్యూటీసీ స్టాండింగ్స్‌లో భారత్‌ను దాటేసిన బంగ్లాదేశ్

పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ అద్భుత ప్రదర్శనతో చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. సిల్హెట్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించి, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ విజయంతో ఐసీసీ వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2027 స్టాండింగ్స్‌లో బంగ్లాదేశ్ అనూహ్యంగా భారత్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ విన్-లాస్ పర్సంటేజ్ 58.33 శాతానికి చేరుకుంది. దీంతో పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. మరోవైపు ఇప్పటివరకు 9 టెస్టులాడి 4 విజయాలు, 4 ఓటములు, ఒక డ్రాతో 48.15 శాతం పాయింట్లతో ఉన్న టీమిండియా ఆరో స్థానానికి పడిపోయింది. ఈ సిరీస్‌లో ఓటమితో పాకిస్థాన్ ఎనిమిదో స్థానంలోనే కొనసాగుతోంది. ఈ ఏడాది భారత్ ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదు. త్వరలో ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు ఆడనున్నా, అది డబ్ల్యూటీసీ సైకిల్‌లో భాగం కాదు. ఇవాళ మ్యాచ్ చివరి రోజు ఆట ప్రారంభమైన కొద్దిసేపటికే బంగ్లాదేశ్ బౌలర్లు పాకిస్థాన్ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికారు. 437 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 316/7తో ఐదో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్థాన్, మరో 42 పరుగులు మాత్రమే జోడించి 358 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్ (94) చివరి వరకు పోరాడినప్పటికీ, సెంచరీకి కేవలం ఆరు పరుగుల దూరంలో ఔటయ్యాడు. రిజ్వాన్ ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ కుప్పకూలింది. ఈ మ్యాచ్‌లో బంగ్లా స్పిన్నర్ తైజుల్ ఇస్లామ్ 6 వికెట్లతో పాక్ పతనాన్ని శాసించాడు. చివరి రోజు రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా ప్రమాదకరంగా మారుతున్న రిజ్వాన్‌ను షోరిఫుల్ ఇస్లామ్ ఔట్ చేయడంతో బంగ్లా విజయం ఖాయమైంది. పాకిస్థాన్‌పై స్వదేశంలో బంగ్లాదేశ్‌కు ఇదే మొట్టమొదటి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. 2024లో పాకిస్థాన్ గడ్డపై 2-0తో సిరీస్ గెలిచిన బంగ్లా, ఇప్పుడు స్వదేశంలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది.

## శ్రేయస్ అద్భుత కెప్టెన్ అవుతాడు: పాంటింగ్

భారత టీ20 జట్టు తదుపరి కెప్టెన్ రేసుపై పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కేవలం జట్టులోకి పునరాగమనం చేయడమే కాకుండా.. సూర్యకుమార్ యాదవ్ తర్వాత భారత టీ20 జట్టుకు కెప్టెన్ అయ్యే అన్ని అర్హతలూ ఉన్నాయని పాంటింగ్ మద్దతు ప్రకటించాడు. భారత టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ అయ్యర్ ముందున్నాడని రికీ పాంటింగ్ స్పష్టం చేశాడు. ఐపీఎల్ టోర్నీ ప్రారంభంలో అయ్యర్ ఎంతటి నాణ్యమైన ఆటగాడో అందరం చూశామని గుర్తు చేశారు. ప్రస్తుతం మైదానం, వెలుపలా అతడు ఉన్న స్థితిని బట్టి చూస్తే కెప్టెన్సీకి సరైన ఎంపికగా కనిపిస్తున్నాడని అభిప్రాయపడ్డాడు. అయ్యర్ తన కెరీర్‌లో మునుపెన్నడూ లేనంత పరిణతి చెందిన ఆటగాడిగా మారాడని పాంటింగ్ కొనియాడాడు. ప్రస్తుతం అతడు తన ఆటపై పూర్తి నియంత్రణతో ఉన్నాడని చెప్పాడు. ఐపీఎల్ లాంటి సుదీర్ఘమైన లీగ్‌లో 14 మ్యాచ్‌ల పాటు ఒకే రకమైన స్థిరత్వాన్ని కొనసాగించడం ఎవరికైనా కష్టమేనని, వ్యక్తిగతంగానూ, జట్టుగానూ హెచ్చుతగ్గులు రావడం సహజమేనని అయ్యర్ ఇటీవలి పేలవ ఫామ్‌ను సమర్థించాడు. పంజాబ్ కింగ్స్ వరుస ఓటములతో ఇబ్బంది పడుతున్నప్పటికీ.. లక్నోతో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో అయ్యర్ కచ్చితంగా పుంజుకుంటాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశాడు. ఆఖరి మ్యాచ్‌లో అయ్యర్ నిలబడి భారీ స్కోరు సాధిస్తే.. జట్టు విజయం సాధించే అవకాశాలు మెరుగవుతాయన్నాడు. అయ్యర్ కెప్టెన్సీ శైలి కూడా ఈ సీజన్‌లో ఎంతో అద్భుతంగా ఉందని ప్రశంసించాడు.

## సూర్యవంశీకి గోయెంకా ప్రశంసలు

ఐపీఎల్ 2026 సీజన్ ప్లే ఆఫ్ రేసులో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుకు చెందిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 38 బంతుల్లో 10 సిక్సర్లు, 7 ఫోర్లతో 93 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌కు ముగ్ధుడైన లక్నో ఫ్రాంచైజీ అధినేత సంజీవ్ గోయెంకా... స్టేడియం స్టాండ్స్‌లో స్వయంగా నిలబడి చప్పట్లతో వైభవ్‌కు అభినందనలు తెలిపారు. అంతేకాకుండా, మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఈ యువ ఆటగాడితో ఆయన ప్రత్యేకంగా ముచ్చటించారు. “ఈ ప్రపంచం ఇప్పటికే అతనిలోని ప్రతిభను చూసింది.. ఈ దేశం అతనిలో గొప్ప భవిష్యత్తును చూస్తోంది.. అతని భుజాలపై ఉన్న బాధ్యతను మోయగల సమర్థత అతనికి ఉంది” అంటూ సంజీవ్ గోయెంకా ఎక్స్ వేదికగా కొనియాడారు. మ్యాచ్ అనంతరం వైభవ్‌తో గోయెంకా మాట్లాడిన దృశ్యాలను చూసి, సునీల్ గవాస్కర్ వంటి కామెంటేటర్లు సరదాగా ‘గోయెంకా త్వరలోనే వైభవ్ కోసం వేలంలో భారీగా బిడ్ వేయబోతున్నారు’ అని వ్యాఖ్యానించడం ఆసక్తికరంగా మారింది.

## వైభవ్ భయపెట్టాడు

లక్నో సూపర్ జెయింట్స్ కోచ్, ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ జస్టిన్ లాంగర్.. రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ప్రశంసల వర్షం కురిపించాడు. కేవలం 15 ఏళ్ల వయసున్న ఈ కుర్రాడిలో తనకు క్రికెట్ దిగ్గజం సర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ తరహా ఆటతీరు, పరిస్థితులకు తగ్గట్లు మారే నైపుణ్యం కనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశాడు. మంగళవారం లక్నోతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 221 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో సూర్యవంశీ కీలక పాత్ర పోషించాడు. కేవలం 36 బంతుల్లో 94 పరుగుల విధ్వంసకర ఇన్నింగ్స్‌తో లక్నో ఓటమిని శాసించాడు. మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన లాంగర్.. సూర్యవంశీ ఇన్నింగ్సే తమ ఓటమికి, రాజస్థాన్ గెలుపుకు మధ్య తేడా అని స్పష్టం చేశాడు.



“అతను 36 బంతుల్లో 94 పరుగులు చేశాడు. కేవలం మూడు ఓవర్లలోనే 73 పరుగులు రాబట్టడంలో అతనిదే కీలక పాత్ర. మ్యాచ్ ఫలితాన్ని మార్చింది అతనే. మా యువ బౌలర్లకు ఇది ఒక మంచి గుణపాఠం” అని లాంగర్ వివరించాడు. సూర్యవంశీ బ్యాటింగ్ తీరు చూస్తుంటే ఊపిరి బిగపట్టాల్సి వస్తోందని లాంగర్ అన్నాడు. “గత మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్, అన్రిచ్ నోర్జే వంటి ప్రపంచ స్థాయి బౌలర్లు అతడికి బౌలింగ్ వేస్తున్నప్పుడు వారి ముఖాల్లో ‘ఇక్కడ ఏం జరుగుతోంది?’ అనే నిస్సహాయత స్పష్టంగా కనిపించింది. ఇది చూసి నాకే ఆశ్చర్యం వేసింది. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా ఉన్న సూర్యవంశీ, ఇంత చిన్న వయసులో ఇలా ఆడుతుంటే భవిష్యత్తులో ఎలా ఆడతాడో ఊహించుకుంటేనే భయంగా ఉంది.




# బంగ్లాదేశ్ ప్రపంచ రికార్డు

### పాకిస్థాన్‌పై అద్భుత విజయం

### పాక్‌కు ఘోర పరాభవం

పాకిస్థాన్ టెస్ట్ జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. తొలిసారి ఈ జట్టు బంగ్లాదేశ్ చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. సిల్హెట్ వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో 78 పరుగుల తేడాతో ఓడటంతో 0-2తో క్లీన్ స్వీప్ అయ్యింది. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్ 104 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో బంగ్లాదేశ్ డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో ఆ జట్టు భారత్‌ను సైతం కిందకు (ఆరో స్థానానికి) నెట్టింది. ఆసీస్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, శ్రీలంక టాప్-4 జట్లుగా కొనసాగుతున్నాయి. ఈ ఓటమితో పాక్ మరింత పతనమై ఎనిమిదో స్థానానికి పడిపోయింది. ఈ గెలుపు బంగ్లాదేశ్‌కు పాక్‌పై వరుసగా నాలుగవది. అంతకుముందు రెండు టెస్ట్‌లకు బంగ్లాదేశ్ పాక్ గడ్డపైనే గెలిచింది. ఈ ఏడాది మార్చిలో బంగ్లా జట్టు పాక్‌ను వన్డే సిరీస్‌లోనూ ఓడించింది. 437 పరుగుల భారీ లక్ష్యఛేదనలో 316-7 స్కోర్ వద్ద చివరి రోజు ఆటను ప్రారంభించిన పాక్.. కొద్దిసేపటిలోనే మిగిలిన 3 వికెట్లు కోల్పోయి 358 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ మొహమ్మద్ రిజ్వాన్ (94) పాక్‌ను గట్టెక్కించే ప్రయత్నంలో విఫలమయ్యాడు. అతని పోరాటం వృధా అయ్యింది. తైజుల్ ఇస్లాం (34.2-4-120-6) అద్భుత ప్రదర్శనలతో పాక్ పతనాన్ని శాశించాడు. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ తొలుత బ్యాటింగ్ చేసి తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులకు ఆలౌటైంది. లిటన్ దాస్ (126) సెంచరీతో కదంతొక్కాడు. పాక్ బౌలర్లలో ఖుర్రమ్ షెహజాద్ (17-1-81-4), మొహమ్మద్ అబ్బాస్ (16-3-45-3) రాణించారు. అనంతరం పాక్ కూడా తొలి ఇన్నింగ్స్‌లో తడబడింది. బాబర్ ఆజం (68) ఒక్కడే రాణించడంతో అతి కష్టంమీద 232 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్లలో తైజుల్, నహిద్ రాణా తలో 3, తస్కిన్, మెహిది హసన్ మిరాజ్ చెరో 2 వికెట్లతో పాక్ ఆట కట్టించారు. కీలక ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ ఈ ఇన్నింగ్స్‌లోనూ తొలుత తడబడినప్పటికీ.. ఆతర్వాత అనూహ్యంగా పుంజుకుంది. ముష్ఫిఫర్ రహీం (137) సూపర్ సెంచరీతో చెలరేగాడు. ఫలితంగా బంగ్లాదేశ్ 390 పరుగుల భారీ స్కోర్ చేసి పాక్‌కు 437 పరుగుల టార్గెట్ సెట్ చేసింది. ఛేదనలో రిజ్వాన్ సహా షాన్ మసూద్ (71), సల్మాన్ అఘా (71) అర్ధ సెంచరీతో రాణించినా పాక్‌ను గట్టెక్కించలేకపోయారు.


ఈవార్తలు ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు

గురువారం 21-5-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# హైదరాబాద్ ట్రాఫిక్ నరకం

విశ్వనగరంగా, గ్లోబల్ ఐటీ హబ్‌గా అంతర్జాతీయంగా వెలుగొందుతున్న హైదరాబాద్ మహానగరం నేడు ట్రాఫిక్ కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. నగరవాసికి, ముఖ్యంగా దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్న ఐటీ కారిడార్ ఉద్యోగులకు రోడ్డుపై ప్రయాణం ఒక పీడకలగా మారింది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయం నుండి రాత్రి ఇళ్లకు చేరే వరకు రోడ్లన్నీ వాహన సముద్రాలుగా మారుతున్నాయి. గంటల తరబడి సిగ్నళ్ల వద్ద, ఫ్లైఓవర్ల కింద వేచి ఉండాల్సి రావడంతో ప్రజల విలువైన సమయం, ఆరోగ్యం, ఇంధనం బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. హైదరాబాద్‌కు గుండెకాయ లాంటి మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఐటీ ఉద్యోగులు కేవలం 5 నుండి 8 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి 1.5 నుండి 2 గంటల సమయం పడుతోంది. మైండ్ స్పేస్, బయోడైవర్సిటీ, విప్రో జంక్షన్, కేబుల్ బ్రిడ్జ్ పరిసర ప్రాంతాలు నిత్యం వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. సుదీర్ఘ ట్రాఫిక్ జామ్‌ల వల్ల ఉద్యోగులు తీవ్ర శారీరక శ్రమకు, మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. ఇది వారి పని సామర్థ్యంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ తీవ్రమైన సమస్యపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిమ్మకు నీరెత్తినట్లున్న వైఖరి నగర ప్రజల్లో, ముఖ్యంగా టెక్కీలలో తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఎన్నికల ముందు నగర మౌలిక వసతులను సమూలంగా మారుస్తామని, ప్రజా రవాణాను బలోపేతం చేస్తామని ఇచ్చిన హామీలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం కింద మిగిలిపోయిన పనులను వేగవంతం చేయడంలో ప్రస్తుత సర్కారు విఫలమైంది. కొత్త ఫ్లైఓవర్లు, అండర్ పాస్ ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఐటీ కారిడార్‌ను విమానాశ్రయంతో కలిపే మెట్రో రెండో విడత విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. రాయదుర్గం నుంచి శంషాబాద్ రూట్, అలాగే ఇతర ఐటీ కనెక్టివిటీ రూట్లపై కేవలం సమీక్షలకే పరిమితమవ్వడం మినహా క్షేత్రస్థాయిలో అడుగులు పడలేదు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీస్, హెచ్‌ఎండీఏ విభాగాల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల చిన్నపాటి వర్షానికే ఐటీ కారిడార్ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లోపాల వల్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. కేవలం ప్రచార ఆర్భాటాలు, రాజకీయ సమీక్షలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తక్షణ వ్యూహాత్మక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఐటీ కంపెనీలతో మాట్లాడి వర్క్ ఫ్రమ్ హోమ్ లేదా స్టాగర్డ్ ఆఫీస్ టైమింగ్స్ (షిఫ్ట్ వేళల్లో మార్పులు) అమలు చేయాలి. నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచడం, మెట్రో ఫ్రీక్వెన్సీని పెంచడం, ఐటీ కారిడార్‌లో ఫీడర్ బస్సులను సమర్థవంతంగా నడపడం వంటి పనులు యుద్ధప్రాతిపదికన జరగాలి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం ఇప్పటికైనా తన కుంభకర్ణ నిద్ర వీడి, తక్షణమే స్పందించకపోతే.. దేశంలోనే అత్యుత్తమ నివాస యోగ్యమైన నగరంగా ఉన్న హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఐటీ సంస్థలు ప్రత్యామ్నాయాల వైపు చూసేలోపే కాంగ్రెస్ సర్కారు కార్యాచరణకు దిగాలి.



# నైపుణ్యాలే శ్రీరామరక్ష

**మానవ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రస్తుత కాలంలో సాంకేతిక రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు ఊహలకు మాత్రమే పరిమితమైన ఎన్నో అద్భుతాలు నేడు మన కళ్ల ముందే ఆవిష్కృతమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్వాంటం కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలు ప్రపంచ రూపురేఖలను సమూలంగా మార్చివేస్తున్నాయి. మరోవైపు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సాధిస్తున్న అపూర్వ విజయాలు విశ్వయవనికపై దేశ కీర్తి పతాకను ఎగురవేస్తున్నాయి.**

ఈ పరిణామాలు కేవలం శాస్త్రవేత్తలకు, నిపుణులకు మాత్రమే కాకుండా, విద్యార్థులకు, యువతకు అపారమైన అవకాశాల తలుపులు తెరుస్తున్నాయి. మారుతున్న ఈ నవ శకంలో భవిష్యత్తు ఉద్యోగాలకు యువత తమను తాము ఎలా సన్నద్ధం చేసుకోవాలన్నది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నేడు ప్రతి రంగంలోనూ చొచ్చుకుపోయింది. వైద్యం, వ్యవసాయం, విద్య, రక్షణ, ఆర్థిక రంగాలు... ఇలా ప్రతిచోటా ఏఐ తనదైన ముద్ర వేస్తోంది. ఇది కేవలం పనులను సులభతరం చేయడమే కాకుండా, కొత్త తరహా ఆలోచనలకు జీవం పోస్తోంది. దీనికి తోడు 'క్వాంటం కంప్యూటింగ్' రాకతో సాంకేతిక ప్రపంచంలో మరో విప్లవం రాబోతోంది. సాధారణ సూపర్ కంప్యూటర్లు సైతం సంవత్సరాల తరబడి పరిష్కరించలేకపోయే జటిలమైన సమస్యలను క్వాంటం కంప్యూటర్లు క్షణాల్లో విశ్లేషించగలవు. ఈ రెండు సాంకేతికతల కలయికతో కొత్త ఔషధాల ఆవిష్కరణ, వాతావరణ మార్పుల కచ్చితమైన అంచనా, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో ఊహించని పురోగతి సాధ్యమవుతుంది. ఈ క్రమంలో డేటా సైంటిస్టులు, ప్రాంప్ట్ ఇంజనీర్లు, ఏఐ ఎథిసిస్టులు, క్వాంటం అల్గారిథమ్ డెవలపర్లు వంటి సరికొత్త ఉద్యోగాలకు భారీగా డిమాండ్ ఏర్పడుతోంది. చంద్రయాన్-3తో చంద్రుని దక్షిణ ధ్రువంపై కాలుమోపిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ఆదిత్య ఎల్-1 ద్వారా సూర్యుని గుట్టు విప్పే ప్రయత్నం, గగన్‌యాన్ ద్వారా మానవులను అంతరిక్షంలోకి పంపే ప్రణాళికలు ఇస్రో సత్తాకు నిదర్శనాలు. ఒకప్పుడు అంతరిక్ష రంగం కేవలం ప్రభుత్వ సంస్థలకే పరిమితం. కానీ నేడు ప్రైవేట్ భాగస్వామ్యానికి కూడా కేంద్రం పచ్చజెండా ఊపడంతో భారత్‌లో స్పేస్ స్టార్టప్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అంతరిక్ష వాహక నౌకల తయారీ, ఉపగ్రహాల ప్రయోగం, శాటిలైట్ డేటా విశ్లేషణ వంటి రంగాల్లో యువతకు అద్భుతమైన కెరీర్ అవకాశాలు ఉద్భవిస్తున్నాయి. ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆస్ట్రో ఫిజిక్స్, మెటీరియల్ సైన్స్, స్పేస్ లా వంటి కోర్సులకు భవిష్యత్తులో అత్యంత ప్రాధాన్యత ఉండబోతోంది. సాంకేతికత ఎంత వేగంగా మారుతుందో, ఉద్యోగ స్వభావాలు కూడా అంతే వేగంగా మారుతున్నాయి. దశాబ్దం క్రితం ఉన్న ఉద్యోగాలు నేడు లేవు, నేడు ఉన్నవి రేపు ఉండకపోవచ్చు. ఈ పరిస్థితుల్లో పాత మూస పద్ధతుల్లో చదువుకుని, కేవలం సర్టిఫికెట్ల మీద ఆధారపడితే ప్రయోజనం లేదు. విద్యార్థులు నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉంది. ఏ రంగానికి చెందిన విద్యార్థులైనా కనీస సాంకేతిక పరిజ్ఞానం, డేటాను విశ్లేషించే నైపుణ్యం కలిగి ఉండాలి. పైథాన్, డేటా అనలిటిక్స్ వంటివి నేర్చుకోవడం ఎంతో ఉపకరిస్తుంది. యంత్రాలు చేయలేని పనులు మనుషులు మాత్రమే చేయగలరు. అందువల్ల విమర్శనాత్మక ఆలోచన, సమస్యలను భిన్న కోణాల్లో పరిష్కరించే సామర్థ్యాన్ని పెంచుకోవాలి. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కోర్సెరా, ఎడెక్స్, ఎన్‌పిటిఇఎల్ వంటి వేదికల ద్వారా ప్రపంచస్థాయి ప్రొఫెసర్ల నుంచి కొత్త విషయాలు నేర్చుకోవాలి. చదివిన దాన్ని ప్రాక్టికల్ ప్రాజెక్టుల ద్వారా ఆచరణలో పెట్టాలి. మారుతున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా తమను తాము మలచుకునే ఫ్లెక్సిబిలిటీ యువతలో ఉండాలి. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నది పాత మాట. సరైన నైపుణ్యం ఉంటే యువత అద్భుతాలు సృష్టిస్తారు అన్నది నేటి ఆధునిక సత్యం. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, స్పేస్ టెక్నాలజీలు యువత ముందు ఒక సువిశాల ప్రపంచాన్ని ఆవిష్కరి స్తున్నాయి. ఈ అవకాశాలను అందిపు చ్చుకోవాలంటే, విద్యార్థులు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి. నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుప రుచుకుంటూ, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అడుగులు వేస్తే... విజయ శిఖరాలను అధిరోహించడం ఖాయం. నవ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించే దిశగా యువత సమాయత్తం కావాల్సిన సమయం ఆసన్నమైంది.



రణధీర్ గుండు
టెక్ నిపుణుడు

# సంక్షోభంలో స్వర్ణకారులు

**భారతీయ సమాజంలో బంగారానికి ఉన్న ప్రాధాన్యం కేవలం ఆభరణాల వరకే పరిమితం కాదు. అది కుటుంబ గౌరవానికి, ఆర్థిక భద్రతకు, సంప్రదాయానికి, భావోద్వేగానికి ప్రతీక. పుట్టిన శిశువుకు మొదటి బంగారు గొలుసు నుంచి పెళ్లి మండపంలో వధువు ధరించే నగల వరకు ప్రతి సందర్భంలో బంగారం ఒక సంస్కృతిగా నిలిచింది. ఈ సంస్కృతిని తరతరాలుగా మోస్తూ వచ్చినవారు సంప్రదాయ స్వర్ణకారులు, చిన్న బంగారు వ్యాపారులు. కానీ కాలం మారుతోంది. మార్కెట్ స్వరూపం మారుతోంది. ఒకప్పుడు నమ్మకానికి నిలయాలుగా ఉన్న చిన్న బంగారు దుకాణాలు ఇప్పుడు కార్పొరేట్ జువెలరీ సంస్థల భారీ పోటీలో మనుగడ కోసం పోరాడుతున్నాయి. భారీ మూలధనం, విస్తృత ప్రకటనలు, ఆధునిక మార్కెటింగ్ వ్యూహాలు, డిజిటల్ సదుపాయాలతో పెద్ద కార్పొరేట్ సంస్థలు బంగారం వ్యాపార రంగాన్ని వేగంగా ఆక్రమిస్తున్నాయి.**



ఈ మార్పు కేవలం వ్యాపార పోటీ మాత్రమే కాదు; ఇది వేలాది సంప్రదాయ కుటుంబాల జీవనాధారంపై పడుతున్న గట్టి దెబ్బ. ఒకప్పుడు బంగారం కొనాలంటే ప్రజలు తమకు తెలిసిన స్వర్ణకారుడి దగ్గరకే వెళ్లేవారు. "మా ఇంటి బంగారం అతనే చేస్తాడు" అనే నమ్మకం ప్రతి కుటుంబంలో ఉండేది. గ్రామాల్లో, చిన్న పట్టణాల్లో స్వర్ణకారుడు కేవలం వ్యాపారి కాదు; కుటుంబ సభ్యుడిలా భావించేవారు. అప్పుగా నగలు ఇచ్చినా, పాత బంగారం మార్చినా, అవసరమైనప్పుడు సహాయం చేసిన వ్యక్తిగా గుర్తింపు ఉండేది.

కానీ నేడు వినియోగదారుల అభిరుచులు వేగంగా మారుతున్నాయి. టెలివిజన్ ప్రకటనలు, సినీ నటీనటులతో బ్రాండ్ ప్రమోషన్లు, సోషల్ మీడియా ప్రచారం ద్వారా పెద్ద జువెలరీ బ్రాండ్లు ప్రజల మనస్తత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయి. "హాల్‌మార్క్ గ్యారంటీ", "బైబ్యాక్ పాలసీ", "జీరో మేకింగ్ చార్జ్", "ఈఎంఐ సదుపాయం", "పండుగ ఆఫర్లు" వంటి ప్రచారాలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. దీంతో చిన్న దుకాణాలపై నమ్మకం ఉన్నప్పటికీ ప్రజలు బ్రాండ్ షోరూముల వైపు మొగ్గు చూపుతున్నారు. కార్పొరేట్ జువెలరీ సంస్థలకు ఉన్న ప్రధాన బలం భారీ పెట్టుబడులు. వారు దేశవ్యాప్తంగా శాఖలను ఏర్పాటు చేయగలరు. ఒకేసారి వేల కిలోల బంగారం కొనుగోలు చేసి తక్కువ ధరలకు తయారీ చేయించగలరు. దీనివల్ల మేకింగ్ చార్జీలను తగ్గించి మార్కెట్లో పోటీ ధరలకు విక్రయించగలుగుతున్నారు. ఇదే సమయంలో చిన్న వ్యాపారులు పరిమిత మూలధనంతో పనిచేస్తున్నారు. రోజువారీ నగదు ప్రవాహంపైనే వారి వ్యాపారం ఆధారపడి ఉంటుంది. బంగారం ధర ఒక్కసారిగా పెరిగినా, తగ్గినా మొదట దెబ్బ తినేది వీరే. భారీ డిస్కౌంట్లు ఇవ్వడం, ప్రకటనలు చేయడం, విలాసవంతమైన షోరూములు నిర్మించడం చిన్న వ్యాపారులకు సాధ్యం కాదు. ఈ పరిస్థితి అసమాన పోటీకి దారితీస్తోంది. ఒకవైపు వేల కోట్ల టర్నోవర్ ఉన్న సంస్థలు, మరోవైపు కుటుంబ ఆధారిత చిన్న దుకాణాలు. ఈ పోటీలో సంప్రదాయ వ్యాపారులు వెనుకబడటం సహజమే.

ఇటీవలి సంవత్సరాల్లో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితి, డాలర్ మార్పిడి విలువలు, కేంద్ర బ్యాంకుల బంగారం నిల్వలు వంటి కారణాలతో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దీంతో మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలు బంగారం కొనుగోళ్లు తగ్గించుకుంటున్నాయి. ఒకప్పుడు పెళ్లిళ్లలో వంద గ్రాములు, రెండు వందల గ్రాముల వరకు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు అవసరానికి మాత్రమే పరిమితమవుతున్నారు. కొందరు బంగారం బదులుగా డైమండ్ ఇమిటేషన్ నగలు లేదా లైట్ వెయిట్ జువెలరీని ఎంచుకుంటున్నారు. ఈ మార్పు చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎందుకంటే వారి అమ్మకాలలో ఎక్కువ భాగం స్థానిక కుటుంబాల కొనుగోళ్లపైనే ఆధారపడి ఉంటుంది. పెద్ద కార్పొరేట్ సంస్థలు మాత్రం దేశవ్యాప్తంగా విస్తరించిన మార్కెట్ కారణంగా నష్టాలను భరించగలుగుతున్నాయి. భారతీయ నగల తయారీలో చేతిపనికి ప్రత్యేక గుర్తింపు ఉంది. చెక్కుచెదరని నైపుణ్యం, సృజనాత్మకత, శ్రమతో స్వర్ణకారులు అద్భుతమైన కళాఖండాలను రూపొందించేవారు. ఆలయ నగలు, నక్షీ వర్క్, కుందన్ డిజైన్లు, ఫిలిగ్రీ పనులు వంటి ఎన్నో కళారూపాలు భారతీయ స్వర్ణకళను ప్రపంచానికి పరిచయం చేశాయి. కానీ ఇప్పుడు యంత్రాల ఆధారిత తయారీ పెరుగుతోంది. మెషిన్ కట్ డిజైన్లు తక్కువ సమయంలో భారీ సంఖ్యలో తయారవుతున్నాయి. కార్పొరేట్ కంపెనీలు చైనా, ఇటలీ, టర్కీ వంటి దేశాల నుంచి ఆధునిక యంత్రాలను తీసుకువచ్చి భారీ ఉత్పత్తి చేస్తున్నారు. దీంతో చేతిపని చేసే కళాకారులకు అవకాశాలు తగ్గుతున్నాయి. రోజుకు గంటల తరబడి కూర్చుని సూక్ష్మ నగలు తయారు చేసే కళాకారులకు సరైన పారితోషికం దక్కడం లేదు. చాలామంది యువకులు ఈ వృత్తిని వదిలి ఇతర ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. ఇది కేవలం ఉపాధి సమస్య మాత్రమే కాదు; భారతీయ సంప్రదాయ కళల అంతరించిపోవడానికి దారితీసే ప్రమాద సంకేతం.

డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ వ్యాపారం వేగంగా పెరుగుతోంది. మొబైల్ యాప్‌ల ద్వారా నగల ఎంపిక, వర్చువల్ ట్రై-ఆన్, ఇంటికే డెలివరీ వంటి సదుపాయాలు యువతను ఆకర్షిస్తున్నాయి. పెద్ద కంపెనీలు డిజిటల్ మార్కెటింగ్‌కు భారీగా ఖర్చు చేస్తూ కొత్త తరాన్ని తమవైపు తిప్పుకుంటున్నాయి. కానీ చిన్న వ్యాపారులకు ఈ మార్పుకు తగిన సాంకేతిక మద్దతు లేదు. చాలా మంది ఇప్పటికీ సంప్రదాయ పద్ధతులకే పరిమితమై ఉన్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లు ఏర్పాటు చేయడం, డిజిటల్ చెల్లింపులు నిర్వహించడం, సోషల్ మీడియా మార్కెటింగ్ చేయడం వంటి అంశాల్లో వెనుకబడి ఉన్నారు. దీంతో యువ వినియోగదారుల మార్కెట్‌ను కోల్పోతున్నారు. భవిష్యత్తులో డిజిటల్ మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలున్న నేపథ్యంలో ఇది చిన్న వ్యాపారులకు పెద్ద సవాలుగా మారుతోంది. బంగారం వ్యాపారంపై పన్నుల భారం కూడా చిన్న వ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. జీఎస్టీ అమలు తర్వాత లావాదేవీల నిర్వహణ, బిల్లింగ్, ఆడిటింగ్ వంటి ప్రక్రియలు క్లిష్టమయ్యాయి. పెద్ద సంస్థలకు ప్రత్యేక అకౌంటింగ్ విభాగాలు ఉండటంతో అవి ఈ వ్యవస్థకు త్వరగా అలవాటు పడ్డాయి. కానీ చిన్న వ్యాపారులు మాత్రం పన్ను నిబంధనల భారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పొరపాట్లు కూడా జరిమానాలకు దారితీస్తున్నాయి. బ్యాంకు రుణాలు పొందడంలోనూ అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. సంప్రదాయ బంగారు వ్యాపారులకు తక్కువ వడ్డీ రుణాలు సులభంగా అందడం లేదు. బ్యాంకులు పెద్ద కంపెనీలకు సులభంగా రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ చిన్న వ్యాపారుల విషయంలో కఠిన నిబంధనలు అమలు చేస్తున్నాయి. తాకట్టు సమస్యలు, పత్రాల సమస్యలు, ఆదాయ పన్ను రికార్డులు వంటి కారణాలతో రుణాలు తిరస్కరించబడుతున్నాయి. దీంతో చాలామంది ప్రైవేట్ ఫైనాన్స్‌పై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీ భారం వ్యాపారాన్ని మరింత సంక్షోభంలోకి నెడుతోంది.

చిన్న బంగారు దుకాణాలు కేవలం వ్యాపార కేంద్రాలు మాత్రమే కావు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అవి కీలక పాత్ర పోషిస్తాయి. స్థానికంగా ఉపాధి కల్పించడం, అవసరమైనప్పుడు అప్పుగా సహాయం చేయడం, పండుగల సమయంలో గ్రామ ఆర్థిక చలామణిని పెంచడం వంటి అనేక విధాలుగా ఈ రంగం గ్రామీణ జీవనానికి అనుసంధానమై ఉంది. చిన్న దుకాణాలు మూతపడితే కేవలం వ్యాపారులు మాత్రమే కాదు; వారిపై ఆధారపడిన కళాకారులు, కార్మికులు, పాలిషింగ్ కార్మికులు, డిజైన్ కార్మికులు, రవాణా రంగం కూడా ప్రభావితమవుతుంది. ఇప్పటి తరం వినియోగదారులు బ్రాండ్ విలువకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. షోరూమ్ వాతావరణం, ఎయిర్ కండిషనింగ్, ఆధునిక డిస్ప్లేలు, డిజిటల్ బిల్లింగ్ వంటి అంశాలు కొనుగోలు అనుభవాన్ని ప్రభావితం చేస్తున్నాయి. అయితే చిన్న వ్యాపారుల వద్ద వ్యక్తిగత అనుబంధం, కస్టమర్‌తో నమ్మక సంబంధం, అవసరానికి తగ్గ కస్టమ్ డిజైన్లు వంటి ప్రత్యేకతలు ఇప్పటికీ ఉన్నాయి. వీటిని ఆధునిక మార్కెటింగ్‌తో మేళవించగలిగితే చిన్న వ్యాపారులు తిరిగి నిలబడే అవకాశముంది. ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న బంగారు వ్యాపారులు కూడా మార్పుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. కేవలం సంప్రదాయ పద్ధతులపైనే ఆధారపడితే మనుగడ కష్టమవుతుంది. దేశ ఆర్థికాభివృద్ధిలో కార్పొరేట్ రంగం పాత్రను ఎవరూ తిరస్కరించలేరు. కానీ అదే సమయంలో సంప్రదాయ వృత్తులు కనుమరుగవకుండా కాపాడాల్సిన బాధ్యత కూడా సమాజంపై ఉంది. చిన్న వ్యాపారులు నిలబడకపోతే స్థానిక ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుంది. సంప్రదాయ కళలు అంతరించిపోతాయి. కుటుంబ ఆధారిత ఉపాధి వ్యవస్థలు కూలిపోతాయి. కేవలం లాభాల కోణంలో కాకుండా సామాజిక సమతుల్యత దృష్టితో కూడా ఈ సమస్యను చూడాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ వృద్ధి, సంప్రదాయ వృత్తుల సంరక్షణ -- ఈ రెండింటి మధ్య సమతుల్యత అవసరం.

భారతీయ బంగారం వ్యాపారం ప్రస్తుతం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. ఒకవైపు ఆధునిక కార్పొరేట్ వ్యాపార సంస్కృతి వేగంగా విస్తరిస్తుండగా, మరోవైపు సంప్రదాయ స్వర్ణకారుల జీవనాధారం సంక్షోభంలో పడుతోంది. ఇది కేవలం వ్యాపార మార్పు కాదు; సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పు. చిన్న బంగారు వ్యాపారులు కేవలం దుకాణదారులు కాదు. వారు సంప్రదాయ కళలకు వారసులు. వారి చేతుల్లో భారతీయ సంస్కృతి ప్రతిబింబిస్తుంది. అలాంటి వృత్తులు కనుమరుగైతే అది దేశ సంపద కోల్పోవడమే అవుతుంది. అందుకే ప్రభుత్వం, సమాజం, వినియోగదారులు కలిసి ఈ రంగాన్ని కాపాడేందుకు ముందుకు రావాలి. ఆధునికతను అంగీకరిస్తూనే సంప్రదాయాన్ని సంరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే రేపటి తరాలు "ఒకప్పుడు గ్రామాల్లో స్వర్ణకారులు ఉండేవారు" అని చరిత్రలో మాత్రమే చదివే పరిస్థితి రావచ్చు.



వెంకటేశ్ గుగ్గిళ్ల
97052 25122

వ్యాసకర్త: ఈవార్తలు
దినపత్రిక రిపోర్టర్

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.